TGTEL/25/A0977

# తొవ్వ

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 64 | శుక్రవారం 31-10-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 5 | వెల : 5 రూ/.

## మద్యం సేవించి వాహనాలు నడపవద్దు

పెద్దవంగర అక్టోబర్30(తొవ్వ) :



మండల కేంద్రంలోని తొర్రూరు వలిగొండ ప్రధాన రహదారి వద్ద గురువారం సైబర్ నేరాలపై ఎస్ ఐ ప్రమోద్ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని రోడ్లపై వాహనాలు నిలుపువద్దని మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఆయన అన్నారు. అనంతరం మెయిన్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది యువకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ మీడియా జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలంటూ పిఆర్ కమిషనర్ కు వినతి

హైదరాబాద్ సచివాలయం:



డిజిటల్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో డిజిటల్ మీడియా జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సచివాలయంలో ఐ అండ్ పీఆర్ కమిషనర్ ప్రియాంకని కలిసి గురువారం రాష్ట్ర సచివాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ అంశం పై సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కారం కు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కే రాజేంద్ర ప్రసాద్,ఉపాధ్యక్షులు తలశిలా యుగేందర్,సభ్యులు కిరణ్, రమేష్,స్వాతి రెడ్డి,గాయత్రి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మొంథా దెబ్బతో భారీ పంట నష్టం

## 4,47,864 ఎకరాల్లో పంట నష్టం

- మొంథా తుఫాన్ దెబ్బతో వరంగల్, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో తీవ్ర నష్టం
- 12 జిల్లాల్లోని 179 మండలాల్లో ప్రభావం
- నష్టపోయిన రైతులు 2.5 లక్షల మందిపైనే..
- వ్యవసాయ శాఖ ప్రాథమిక నివేదిక
- సమగ్ర సర్వే తర్వాత పూర్తిస్థాయి నిర్ధారణ
- ఎకరాకు 10వేలు పరిహారం ప్రకటించే చాన్స్
- రాష్ట్రవ్యాప్తంగా రోడ్లకు రూ.225 కోట్ల నష్టం
- అప్రమత్తంగా ఆర్అండ్బీ: మంత్రి కోమటిరెడ్డి



**హైదరాబాద్, అక్టోబరు 30:** మొంథా తుఫాను రాష్ట్ర రైతాంగం నడ్డివిరిచింది. చేతికొచ్చే దశలో ఉన్న పంటలను ఊహించని విధంగా దెబ్బతీసింది. తుఫాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 4,47,864 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు వ్యవసాయ శాఖ ప్రాథమిక సర్వేలో గుర్తించింది. ఇందులో సగానికిపైగా వరి పంటే ఉందని.. పత్తి, మొక్కజొన్న, మిర్చి, వేరుశనగ, పప్పుధాన్యాలు, ఇతర పంటలకూ నష్టం జరిగిందని గుర్తించింది. రాష్ట్రంలో 12 జిల్లాల్లోని, 179 మండలాల్లో తుఫాన్ ప్రభావం చూపిందని, 2.53 లక్షల మంది రైతులు పంటలు నష్టపోయారని లెక్కతేల్చింది. ముఖ్యంగా వరంగల్, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో పంట నష్టం తీవ్రంగా ఉందని తేల్చింది. ఈ మేరకు గురువారం వ్యవసాయ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాథమిక నివేదికను సమర్పించింది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ, కరీంనగర్ జిల్లాల్లో మొంథా తుఫాను ప్రభావానికి పంటలు దెబ్బతిన్నాయి. కొనుగోలు కేంద్రాల్లో వరి, మక్కలు, పత్తి తడిసిపోయాయి. ఈ క్రమంలో వ్యవసాయ శాఖ బుధ, గురువారాల్లో ప్రాథమిక సర్వే నిర్వహించింది. 2,82,379 ఎకరాల్లో వరి, 1,51,707 ఎకరాల్లో పత్తి, 4,963 ఎకరాల్లో మొక్కజొన్న, 3,613 ఎకరాల్లో మిర్చి, 1,228 ఎకరాల్లో పప్పు ధాన్యాలు, 2,674 ఎకరాల్లో వేరుశనగ, 1,300 ఎకరాల్లో ఉద్యాన పంటలు కలిపి మొత్తం 4,47,864 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు గుర్తించింది. అత్యధికంగా వరంగల్ జిల్లాలో 1.30 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. 80,500 మంది రైతులు నష్టపోయారు. ఖమ్మం జిల్లాలో 62,400 ఎకరాలు, సూర్యాపేటలో 56,330, నల్లగొండలో 52,071 ఎకరాల్లో పంటనష్టం జరిగింది. ఇక నష్టంపై పూర్తిస్థాయి సర్వే చేపట్టాలని వ్యవసాయ మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. తుఫాను, భారీ వర్షాలతో వచ్చిన వరదల ప్రభావం ఇంకా తగ్గలేదు. అధికారులు పూర్తిస్థాయిలో క్షేత్ర పర్యటనలు చేయలేదు. సమగ్ర సర్వే చేపడితే పంటనష్టంపై కచ్చితమైన నిర్ధారణకు వచ్చే అవకాశాలున్నాయి. దీనితో వ్యవసాయ, రెవెన్యూ, ఉద్యాన, అనుబంధ శాఖల అధికారులతో బృందాలను ఏర్పాటుచేసి సమగ్ర సర్వే చేపట్టి.. నష్ట శాతాన్ని తేల్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. వరద నీళ్లు తగ్గాగానే కొన్ని పంటలు కోలుకునే అవకాశాలు ఉంటాయి. దానికితోడు ఎక్కడైనా, ఏదైనా పంట 33శాతానికి మించి దెబ్బతింటేనే నష్టపరిహారం కోసం సిఫారసు చేయాలనే నిబంధన ఉంది. పంటలు ప్రస్తుమున్న దశను బట్టి నష్టశాతం ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో మూడు ప్రధాన పంటలు దిగుబడికి ముందు దశలో ఉండటంతో నష్టశాతం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. మొంథా తుఫాను ప్రభావంతో నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం రేవంత్రెడ్డి పర్యటిస్తారని తెలిపారు. ఎకరానికి ఎంత నష్టపరిహారం ఇవ్వాలనే దానిపై సీఎంతో చర్చించిన తర్వాత ప్రకటిస్తామని చెప్పారు. నష్టపోయిన రైతులకు పరిహారం తప్పకుండా చెల్లిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుతం పంటల బీమా పథకం అమల్లో లేదు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని కూడా అమలు చేయటం లేదు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు రాష్ట్ర ప్రభుత్వమే సర్వే చేయించి, నష్టపరిహారం ఇస్తోంది. గత ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం ఇచ్చింది. ఇప్పుడు కూడా అదే తరహాలో ఎకరానికి రూ.10వేల చొప్పున పంపిణీ చేయవచ్చని వ్యవసాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ప్రాథమిక నివేదిక ప్రకారం చూస్తే.. 4.48 లక్షల ఎకరాల్లో పంట నష్టానికి రూ.448 కోట్ల నష్టపరిహారం చెల్లించాల్సి రానుంది.

## మజ్లిస్ పార్టీ ఓ చీడపురుగు

### కేంద్ర మంత్రి కిషన్రెడ్డి



**హైదరాబాద్, అక్టోబరు 30:** మజ్లిస్ పార్టీ తెలంగాణకు, దేశానికి పట్టిన చీడపురుగు అని కేంద్ర మంత్రి కిషన్రెడ్డి విమర్శించారు. రజాకార్ల వారసత్వాన్ని మోస్తున్న ఆ పార్టీ హిందువుల మనోభావాలతో చెలగాటమాడుతోందని, హైదరాబాద్లో రాజ్యాంగేతర శక్తిగా ఎదుగుతోందని ఆరోపించారు. 'జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎందుకు పోటీ చేయడం లేదు? ఎవరి ఒత్తిళ్లతో, ఎవరి సూట్కేసులకు తలొగ్గి మీ అభ్యర్థిని కాంగ్రెసకు అద్దెకిచ్చారు' అని మజ్లిసను ప్రశ్నించారు. కుహనా లౌకికవాదం, బుజ్జగింపు రాజకీయాలతో కాంగ్రెస్, బీఆర్ఎసలు మజ్లిసకు రక్షణ కవచంగా నిలుస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగై పోయిందన్నారు. బీఆర్ఎస్ ఫాంహౌసకే పరిమితమైందని, ఆ విషయం ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికలతో తేలిపోయిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం గోరక్షణ చట్టాలను అమలు చేయాలని కిషన్రెడ్డి డిమాండ్ చేశారు. 'అటవీ ప్రాంతాల్లో అక్రమ కబేళాలు నడుస్తున్నాయి. హైదరాబాద్లో న్యూ బోయిగూడ, గోల్నాక ప్రాంతాల్లో కూడా కొనసాగుతున్నాయి. వాటిని మూసివేయించాలి. తెలంగాణలోని 39 అక్రమ కబేళాలపై నేను గతంలో సీఎం, సీఎసలకు లేఖలు రాశా. ఇప్పటివరకు వాటిపై ఏ చర్యలు తీసుకున్నారో వెల్లడించాలి' అని కోరారు. గోవుల అక్రమ రవాణా మాఫియాకు మజ్లిస్ అండగా ఉందని ఆరోపించారు. అక్రమ కబేళాలు నడుపుతున్న ఇబ్రహీం ఖురేషీపై ఛత్తీసగఢ్లో కూడా కేసులు నమోదయ్యాయన్నారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో అతనికి సన్నిహిత సంబంధాలున్నట్లు మజ్లిస్ మద్దతుదారులే చెబుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు కూడా అక్రమ కబేళాల్లో భాగస్వాములేనని కిషన్రెడ్డి ఆరోపించారు.

## హరీశ్రావును పరామర్శించిన కవిత



**హైదరాబాద్, అక్టోబరు 30:** మాజీ మంత్రి హరీశ్రావును, ఆయన కుటుంబ సభ్యులను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరామర్శిం చారు. తన భర్త అనిల్తో కలిసి గురువారం హరీశ్ నివాసానికి వెళ్లిన ఆమె.. హరీశ్ తండ్రి తన్నీరు సత్యనారాయణరావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరీశ్కు, ఆయన కుటుంబ సభ్యులకు కవిత దంపతులు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వరద జలాలను తక్కువ ఖర్చుతో మల్లన్నసాగర్ రిజర్వాయర్ నింపుకొనే అవకాశం ఉన్నా.. రేవంత్రెడ్డి సర్కార్ గోదావరి జలాల ఎత్తిపోతలపై ఎందుకు మౌనంగా ఉంటోందని కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. మిడ్మానేరు నుంచి అనంతగిరి, రంగనాయకసాగర్ మీదుగా నీటిని ఎత్తిపోసేందుకు ఈ ప్రభుత్వం కనీస ప్రయ త్నం చేయడం లేదని గురువారం ఎక్స్లో విమర్శించారు. భారీవర్షాల నేపథ్యం లో గోదావరి వరదజలాలు సముద్రంలోకి వృథాగా చేరడం బాధాకరమని, అదేసమ యంలో మిడ్మానేరు, లోయర్మానేరు గేట్లు ఎత్తి వేల టీఎంసీల నీటిని నదిలోకి వదలడం ప్రభుత్వ అనాలోచిత చర్యకు నిదర్శనమని అన్నారు.

## ప్రాణ నష్టం జరగొద్దు

- వర్షాలు, వరదలతో జాగ్రత్త..
- పంటలకు నష్టం వాటిల్లకుండా చూడాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్లో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 30: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాణ నష్టం జరగకుండా చూడాలని సీఎం రేవంత్రెడ్డి ఆదేశించారు. ఆ దిశగా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్న జిల్లాల్లో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్లు, ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో గురువారం ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

భారీ వర్షాలు, వరదల వల్ల ప్రధానంగా వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని మంత్రులు, కలెక్టర్లు సీఎంకు తెలిపారు. ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాలతో పాటు హుస్నాబాద్ నియోజకవర్గంలో వరద నష్టం ఎక్కువగా ఉందని చెప్పారు. సీఎం రేవంత్ మాట్లాడుతూ.. తుపాను నేపథ్యంలో ప్రాణనష్టం జరగకుండా చూడాలన్నారు. పశువుల రక్షణకూ చర్యలు చేపట్టాలని సూచించారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాలు, గ్రామాలు, కాలనీల్లో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టర్లు 24 గంటలూ పరిస్థితులను సమీక్షించడంతో పాటు జిల్లా ఇన్చార్జి మంత్రులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. అనుకోని ఉపద్రవంతో రైతులకు తీరని నష్టం కలుగుతోందని సీఎం రేవంత్రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వర్షంతో చాలా చోట్ల ధాన్యం తడిసిపోయిందని, ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొట్టుకుపోవడం ఆందోళన కలిగించిందని అన్నారు.



## 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్

- నియామక ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి ముర్ము
- కేంద్ర న్యాయ శాఖ నోటిఫికేషన్ జారీ.. 24న ప్రమాణం
- 2027 ఫిబ్రవరి 9 దాకా పదవిలో జస్టిస్ సూర్యకాంత్



**న్యూఢిల్లీ, అక్టోబరు 30:** సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియమితులయ్యారు. కేంద్ర న్యాయ శాఖ ఈ మేరకు గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. నవంబరు 23న ప్రస్తుత సీజేఐ జస్టిస్ భూషణ్ ఆర్ గవాయ్ పదవీ విరమణ చేయనున్న సంగతి తెలిసిందే. దీంతో నవంబరు 24న జస్టిస్ సూర్యకాంత్ 53వ సీజేఐగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన దాదాపు 15 నెలల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. 2027, ఫిబ్రవరి 9న జస్టిస్ సూర్యకాంత్ పదవీ విరమణ చేస్తారు. "భారత రాజ్యాంగం కల్పించిన అధికారం మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. జస్టిస్ సూర్యకాంత్ను నవంబరు 24 నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు" అని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఎక్స్లో పోస్ట్ చేశారు. ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

# మంత్రిగా అజారుద్దీన్.. ప్రమాణం నేడే

## మధ్యాహ్నం 12.15 గంటలకు ప్రమాణం చేయించనున్న గవర్నర్

**హైదరాబాద్, అక్టోబరు 30:** తెలంగాణ రాష్ట్ర మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారైంది. రాజ్భవన్లోని దర్బార్ హాలులో శుక్రవారం మధ్యాహ్నం 12.15 గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్రెడ్డి, మంత్రులు, ముఖ్య నాయకులు పాల్గొననున్నారు. అజారుద్దీన్ను మంత్రివర్గంలోకి తీసుకోవాలని నిర్ణయించిన సీఎం రేవంత్రెడ్డి.. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు సమాచారం అందజేశారు. అజారుద్దీన్తో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించాలని గవర్నర్కు విజ్ఞప్తి చేశారు. ప్రమాణ స్వీకారానికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలంటూ గవర్నర్ కార్యాలయం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి గురువారం లేఖ రాసింది. దీంతో అజారుద్దీన్ ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారైంది. కాగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో అజర్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కోడ్ ఏమైనా అడ్డు వస్తుందా? అని ప్రభుత్వ వర్గాలు ఈసీ అధికారులను ఆరా తీసినట్లు తెలిసింది. మంత్రివర్గ విస్తరణకు ఉప ఎన్నికల కోడ్ అడ్డురాదని వారు వివరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ప్రమాణ స్వీకారానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. మరోవైపు ఉప ఎన్నిక నేపథ్యంలో మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం నిబంధనలకు విరుద్ధమంటూ బీజేపీ నేతలు పాయల శంకర్, మర్రి శశిధర్రెడ్డి, కె.ఆంథోనిరెడ్డిలు గురువారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) సుదర్శన్రెడ్డికి ఫిర్యాదు చేశారు. అజారుద్దీన్ గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారని.. ఇప్పుడు ఆయనకు మంత్రి పదవి ఇవ్వడమంటే ఒక వర్గం ఓటర్లను ప్రభావితం చేయడమేనని తెలిపారు. ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. ఈ ఫిర్యాదును సుదర్శన్రెడ్డి ఈసీ పరిశీలన కోసం పంపారు. అయితే, ఈ ఫిర్యాదును ఈసీ డిస్మిస్ చేయడం లాంఛనమేనని, అజర్ ప్రమాణ స్వీకారం యథాతథంగా జరగుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా కాంగ్రెస్ ఆపద మొక్కులు మొక్కుతోందని, అక్కడ గెలవాలనే మాజీ క్రికెటర్ అజారుద్దీన్కు మంత్రి పదవి కట్టబెడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రజల్లో తమ పరిస్థితి ఏమిటో వారికి అర్థమైందని, పూర్తిగా దిగజారిన పార్టీ పరువును కాపాడుకోవడానికి కాంగ్రెస్ అడ్డగోలు ప్రయత్నాలు చేస్తోందని ఎక్స్లో ఆరోపించారు. ఉప ఎన్నిక కోసం సినీ కార్మికులకు అడ్డగోలు వాగ్దానాలు చేయడం, అజారుద్దీన్ను క్యాబినెట్లోకి తీసుకోవడం, ఎన్నడూ లేనివిధంగా మంత్రులు హైదరాబాద్ వీధుల్లో హడావుడిగా తిరగడం వంటివి ఆ పార్టీ తీవ్ర ఒత్తిడిలో ఉందనేందుకు నిదర్శనమని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజలు కాంగ్రెస్ డిపాజిట్ కోల్పోయేలా చేస్తేనే.. 2023లో వారిచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 వాగ్దానాలను అమలు చేయడం ప్రారంభిస్తుందని కేటీఆర్ అన్నారు. 'కాంగ్రెస్ నేత అజారుద్దీన్ వివిధ కేసుల్లో నిందితుడు. ఆయనకు ఏ ప్రాతిపదికన మంత్రి పదవి ఇస్తారు' అని సీఎం రేవంత్ను కేంద్ర మంత్రి కిషన్రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన అజర్ను ఇప్పుడు హడావుడిగా మంత్రిని చేయాలని నిర్ణయించారన్నారు.



## యాదగిరిగుట్ట ఆలయ ఇన్చార్జి ఎస్ఈ నివాసాల్లో ఏసీబీ సోదాలు

### లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన దేవస్థాన ఇంజనీర్



**యాదాద్రి/కొత్తపేట, అక్టోబరు 30 :** లడ్డూ ప్రసాదాల యంత్రాల మరమ్మతు బిల్లు మంజూరుకు కమీషన్ డిమాండ్ చేసిన యాదగిరిగుట్ట దేవస్థానం విద్యుత్ విభాగం ఇన్చార్జి ఎల్బీనగర్ నివాసంతో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ గురువారం ఏకకాలంలో ఏసీబీ సోదాలు కొనసాగాయి. ఏసీబీ నల్లగొండ జిల్లా రేంజ్ డీఎస్పీ జగదీష్ చంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట సమీపంలోని ఓ కాంట్రాక్టర్కు ఆలయంలో లడ్డూ ప్రసాదాల యంత్రాల మరమ్మతుకు సంబంధించి రూ.11.50 లక్షల బిల్లులు రావాల్సి ఉంది. వాటి మంజూరు కోసం ఆలయ ఇన్చార్జి ఎస్ఈ ఊడెపు వెంకట రామారావును సంప్రదించగా, ఆయన 20శాతం కమీషన్ డిమాండ్ చేశారు. సదరు కాంట్రాక్టర్ రూ.1.90లక్షలు లంచం ఇచ్చేందుకు అంగీకరించి ఆధారాలతో ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి హైదరాబాద్లోని బోడుప్పల్ వద్ద కాంట్రాక్టర్ నుంచి వెంకట రామారావు నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

# బీహార్ దిశ మార్చే మోదీ సందేశం

- 'మేడ్ ఇన్ బీహార్' కల సాకారం కానుంది!
- ఛర్ మైయా పూజను అవమానించిన వారిపై తీవ్ర ఆగ్రహం






న్యూఢిల్లీ, అక్టోబర్ 30 :
లబీహార్ ఎన్నికల వాతావరణం వేడెక్కుతున్న వేళ ప్రధాని నరేంద్ర మోదీ వరుస ట్వీట్లతో రాష్ట్ర ప్రజల్లో ఉత్సాహాన్ని నింపారు. "ఆత్మనిర్భర్ భారత్" ఉద్యమంలో బీహార్ కీలక కేంద్రంగా మారబోతోందని స్పష్టం చేశారు. ప్రపంచంలోని ప్రతి వంటగదిలో "మేడ్ ఇన్ బీహార్" అని ఉన్న ఆహార ప్యాకెట్ తప్పక ఉండాలని తన కల అని మోదీ పేర్కొన్నారు.ప్రధాని ఆర్‌జేడీ, కాంగ్రెస్ పార్టీలు "జంగిల్‌రాజ్" తిరిగి తెచ్చే యత్నంలో ఉన్నాయని ఆరోపించారు. వీరి ఎన్నికల గీతాల్లోనే వారి నీయత బయటపడుతోందని విమర్శించారు. "జంగిల్‌రాజ్ కాలంలో జరిగిన కుకీర్తి ఐదు పదాల్లో చెప్పగలను," అంటూ మరో ట్వీట్‌లో ఆయన వ్యాఖ్యానించారు. ఛర్ మైయా పూజను "డ్రామా, నాటకం"గా పేర్కొన్న ఆర్‌జేడీ -కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు బీహార్ మహిళల గుండెల్లో మంట రేపాయని మోదీ అన్నారు. "ఈ అవమానాన్ని బీహార్ తల్లులు, సోదరీమణులు ఎప్పటికీ మరిచిపోవు. వీరికి ప్రజలు తగిన శిక్ష తప్పక ఇస్తారు" అని హెచ్చరించారు. ముజఫ్ఫర్‌పూర్‌లో జరిగిన భారీ ప్రజాసభలో అపారమైన జనసందోహం తారసపడిరది. ఆ ఉత్సాహం చూసి, "బీహార్‌లో మరోసారి ఎన్డీఏ ప్రభుత్వమే ఏర్పడబోతోందని స్పష్టంగా తెలుస్తోంది" అని మోదీ ప్రకటించారు. బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ తరఫున మోదీ ఆత్మవిశ్వాసంతో, ఉద్వేగభరితంగా ముందుకుసాగుతుండగా, ఆయన ట్వీట్లు రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించాయి.

# బీహార్‌లో మళ్లీ ఎన్డీఏ గాలి

**అభివృద్ధి మార్గంలో ముందుకుసాగుతున్న రాష్ట్రం, అమిత్ షా పిడుగులాంటి వ్యాఖ్యలు!**

**ఎన్డీఏ పట్ల ప్రజల్లో నమ్మకం పెరుగుతోంది**





**పట్నా, అక్టోబర్ 30 :**
బీహార్ ఎన్నికల వేడి క్రమంగా పెరుగుతున్న తరుణంలో, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ఊపు తెచ్చాయి. "ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన తర్వాత బీహార్‌లో ప్రపంచ స్థాయి మౌలిక వసతులు నిర్మించబడ్డాయి. ఒకప్పుడు దూరం, ఆలస్యం, వెనుకబాటుతనంగా మారిన ఈ రాష్ట్రం ఇప్పుడు వేగం, కనెక్టివిటీ, పెట్టుబడుల కేంద్రంగా మారుతోంది" అని షా పేర్కొన్నారు. అమిత్ షా ట్వీట్‌లో బీహార్ అభివృద్ధిని సజీవంగా చిత్రించారు. ఆయన అన్నారు "జంగిల్‌రాజ్ సమయంలో భయంతో రాష్ట్రం వదిలి వెళ్లిపోయిన పెట్టుబడిదారులు ఇప్పుడు తిరిగి వస్తున్నారు. ఇది ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన నమ్మకం, పారదర్శకత ఫలితం." ప్రజల్లో ఈ వ్యాఖ్యలు విశేష స్పందన రేపుతున్నాయి.

ముంగేర్ లో జరిగిన ఎన్డీఏ భారీ సభలో ప్రజల ఉత్సాహం ఉప్పొంగింది. వేలాదిగా తరలివచ్చిన జనసందోహం "మోదీ మళ్లీ, ఎన్డీఏ మళ్లీ" నినాదాలతో ఆ ప్రాంతాన్ని మార్మోగించింది. ఆ వేడిమి చూసి షా ప్రకటించారు "బీహార్ ప్రజలు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. మళ్లీ ఎన్డీఏనే అధికారంలోకి తీసుకురాబోతున్నారు." లఖీ సర్వ్ లో జరిగిన సభలో షా తన ప్రసంగాన్ని మరింత కఠినంగా కొనసాగించారు. "అనధికారిక వలసదారుల సహాయంతో మళ్లీ అధికారంలోకి రావాలని లాలూ అండ్ కంపెనీ కలలు కంటున్నాయి.

కానీ బీహార్ ప్రజలు వారిని గట్టిగా నిలదీస్తారు. రాష్ట్రంలో ఇకపై ఎప్పటికీ జంగిల్‌రాజ్ తిరిగి రాదు." అని ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్డీఏ పట్ల ప్రజల్లో బలమైన విశ్వాసం నెలకొంది. అభివృద్ధి, భద్రత, సదుపాయాలపై దృష్టి పెట్టిన మోదీ- షా జంట బీహార్ ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.బీహార్‌లో ఎన్డీఏ తరఫున అమిత్ షా, మోదీ ప్రచార బరిలోకి దిగడంతో ఎన్నికల రణరంగం మరింత వేడెక్కింది. ప్రజల్లో అభివృద్ధి శబ్దం, రాజకీయ వేదికలపై ఎన్డీఏ శక్తి రెండూ కలసి బీహార్ రాజకీయ దిశను కొత్త దిశగా మలుస్తున్నాయి.

# బెంగాల్‌లో ఎన్ఆర్‌సీ భయాందోళన

- బీజేపీ విధానాలపై మమతా ఘాటు వ్యాఖ్యలు! - మూడు రోజులలో మూడు దుర్ఘటనలు - ప్రజల్లో పెరుగుతున్న భయాందోళన



**కోల్‌కతా, అక్టోబర్ 30 :**
పశ్చిమ బెంగాల్‌లో ఎన్ఆర్‌సీ, ఎస్ఐఆర్ ప్రక్రియల నేపథ్యంలో చోటుచేసుకుంటున్న దారుణ సంఘటనలపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "బీజేపీ భయపెట్టే, విభజించే, ద్వేషపూరిత రాజకీయాల ఫలితమే ఈ విషాదాలు" అని ఆమె వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం ప్రకటించిన ఎస్ఐఆర్ ప్రక్రియ కేవలం 72 గంటల్లోనే మూడు ప్రాణాలు కోల్పోయాయని పేర్కొన్నారు. అక్టోబర్ 27న ఖర్దహా పానిహాటికి చెందిన 57 ఏళ్ల ప్రదీప్ కార్ ఆత్మహత్య చేసుకున్నాడని, ఆయనచీట్లో "నా మరణానికి ఎన్ఆర్‌సీనే కారణం" అని రాసి ఉన్నట్లు మమతా తెలిపారు. అక్టోబర్ 28న కూచ్ బీహార్‌లో 63 ఏళ్ల వ్యక్తి ఎస్ఐఆర్ ప్రక్రియ భయంతో ప్రాణం తీసుకునే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. అక్టోబర్ 29న బీర్భూమ్ జిల్లాలోని ఇలాంబజార్‌లో 95 ఏళ్ల ఖితీష్ మజుందార్ భయంతో ఆత్మహత్య చేసుకున్నారని ఆమె వివరించారు. "తన జీవితాన్ని ఈ నేలకు అర్పించిన 95 ఏళ్ల వృద్ధుడు, ఈ నేల తనదని నిరూపించుకోవాల్సిన పరిస్థితి రావడం దేశ మనసుపై అత్యంత గాయంగా మిగిలింది" అని మమతా ఆవేదన వ్యక్తం చేశారు. "ఇది కేవలం ఒక దుర్ఘటన కాదు, మానవత్వానికి చేసిన ద్రోహం" అని పేర్కొన్నారు. ఈ రాజకీయ ప్రేరేపిత విషాదాలకు ఎవరు సమాధానం చెబుతారు? కేంద్ర హోంమంత్రి బాధ్యత వహిస్తారా? బీజేపీ, దాని మిత్రపక్షాలు ఈ భయపరచే వాతావరణాన్ని సృష్టించాయి. వారు నిశ్శబ్దంగా ఎందుకు ఉన్నారు?" అని ఆమె ప్రశ్నించారు. "ఏ విధంగానూ ఎన్ఆర్‌సీని బెంగాల్‌లో అమలు చేయనివ్వం ముందువైపు గానీ, వెనుకవైపు గానీ కాదు. ఒక్క నిజమైన పౌరునికీ 'అవతలి వాడు' అనే ముద్ర వేయనివ్వం" అని మమతా ప్రకటించారు. "మా మా మట్టి మనుష్ ప్రభుత్వం ప్రతి పౌరుని హక్కులను రక్షిస్తుంది. ఎవ్వరూ ప్రేరేపణకు లోనవ్వకండి, విశ్వాసం కోల్పోవద్దు" అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "బీజేపీ మరియు వారి మిత్రపక్షాలు దేశ సామాజిక ఏకత్వాన్ని ఛిద్రము చేయాలన్న దుష్టయత్నాన్ని చివరి రక్తపు చుక్క వరకు అడ్డుకుంటాం. ప్రజల హక్కులను రక్షించడమే మా లక్ష్యం" అని మమతా బెనర్జీ స్పష్టం చేశారు.

# ముంబైలోకలకలం

**20 మంది పిల్లలను బంధించిన వ్యక్తి పోలీస్ కాల్పుల్లో మృతి**



**ముంబై, అక్టోబర్ 30 :**
మహారాష్ట్ర రాజధాని ముంబైలో దారుణ ఘటన చోటు చేసుకుంది. పోవై ప్రాంతంలోని ఆర్‌ఏ స్టూడియోలో ఒక వ్యక్తి సుమారు 20 మంది చిన్నారులను బంధించడంతో ఆందోళన చెలరేగింది. తన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ వీడియో విడుదల చేసిన అతడిని చివరకు పోలీసులు కాల్చివేశారు. పోలీసుల వివరాల ప్రకారం, రోహిత్ ఆర్య అనే వ్యక్తి ఆర్‌ఏ స్టూడియోలో యాక్టింగ్ ట్రైనర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి యూట్యూబ్ ఛానెల్ కూడా ఉంది. గత నాలుగు రోజులుగా ఆడిషన్లు నిర్వహిస్తున్న రోహిత్ గురువారం ఉదయం వంద మందికి పైగా పిల్లలను స్టూడియోకు రప్పించాడు. ఆడిషన్ ముగిసిన తర్వాత 80 మందిని బయటకు పంపి, 20 మందిని మాత్రం లోపల నిర్బంధించాడు. తరువాత ఒక వీడియో విడుదల చేసిన రోహిత్, తనకు పెద్దగా ఆర్థిక డిమాండ్లు లేవని, కొందరితో మాట్లాడాలనే ఉద్దేశంతో పిల్లలను బందీలుగా ఉంచానని చెప్పాడు. అయితే తనను రెచ్చగొట్టవద్దని, లేకపోతే ప్రాంగణానికి నిప్పు పెడతానని హెచ్చరించాడు. ఈ వీడియో చూసిన తల్లిదండ్రులు భయాందోళనలకు గురయ్యారు. స్టూడియో బయట పెద్ద సంఖ్యలో గుమిగూడి తమ పిల్లలను రక్షించమని వేడుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వేగంగా అక్కడికి చేరుకున్నారు. నిందితుడితో చర్చలు జరిపినా, అతడు సహకరించలేదు. చివరకు పోలీసులు ఆపరేషన్ ప్రారంభించి పిల్లలందరినీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. రోహిత్ ఆర్యను అదుపులోకి తీసుకునే క్రమంలో కాల్పులు జరగడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలించిన అతడు అక్కడ మరణించాడు. ఈ సంఘటనతో ముంబైలో ఒక కలకలం రేగింది. మానసిక అస్థిరత కారణంగా రోహిత్ ఈ చర్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. విచారణ కొనసాగుతోంది.

# రూ. కోట్లు ఖర్చుపెట్టినా ఫలితం శూన్యం



న్యూఢిల్లీ,అక్టోబర్ 30 :
రాజధానిలో పెరిగిపోతున్న వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ఢిల్లీ ప్రభుత్వం చేసిన క్లౌడ్‌సీడిరగ్ ప్రయోగం విఫలమైంది. వందలాది కోట్లు కాదు కానీ, కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినా ఒక్క చినుకూ పడకపోవడంతో ఈ ప్రయత్నం ఫలించలేదని అధికారులు అంగీకరించారు. ప్రతి ఏడాది అక్టోబర్ చివరి, నవంబర్ ప్రారంభంలో ఢిల్లీ వాయు నాణ్యత తీవ్రంగా క్షీణిస్తుంది. పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానా రైతులు పంట అవశేషాలు తగలబెట్టడం, చలికాలపు పొగ మంచు కారణంగా గాలి కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుతుంది. ఈ సమస్యను ఎదుర్కొనేందుకు రేఖా గుప్తా నేతృత్వంలోని ఢిల్లీ ప్రభుత్వం కృత్రిమ వర్షం సృష్టించే ప్రయత్నం చేపట్టింది. దాదాపు 53 ఏళ్ల తర్వాత మొదటిసారిగా ఐఐటీ కాన్పూర్ సహకారంతో క్లౌడ్‌సీడిరగ్ ట్రయల్స్ నిర్వహించారు. బురారి, కరోల్‌బాగ్, మయూర్‌విహార్, బద్లి ప్రాంతాల్లో ఈ ప్రయోగాలు జరిగాయి. ఈ ప్రయత్నాల కోసం ప్రభుత్వం రూ.3.21 కోట్ల బడ్జెట్ కేటాయించింది. అందులో ఇప్పటివరకు జరిగిన మూడు ట్రయల్స్‌కి రూ.1.07 కోట్లు ఖర్చయినట్లు సమాచారం. అక్టోబర్ 23న ఒకటి, 28న రెండు ప్రయోగాలు నిర్వహించారు. అయితే, రూ.కోట్లు కుమ్మరించినా ఒక్క చినుకూ పడకపోవడంతో ఈ ప్రయోగం పూర్తిగా విఫలమైంది. ఐఐటీ కాన్పూర్ తొమ్మిది ట్రయల్స్ చేయాలని ప్రణాళిక వేసినప్పటికీ, మొదటి మూడు విఫలమవడంతో ప్రభుత్వం ఆ ప్రయత్నాన్ని నిలిపివేసింది విమానాల అద్దె, పైలట్ ఫీజులు, ఇంధన వ్యయం, సాంకేతిక సదుపాయాల నిర్వహణ వంటి అంశాలు ఈ ప్రక్రియను ఖరీదైనదిగా మారుస్తున్నాయని ఐఐటీ కాన్పూర్ డైరెక్టర్ తెలిపారు. మొత్తం శీతాకాలం కాలుష్య నియంత్రణ కోసం క్లౌడ్‌సీడిరగ్ కొనసాగిస్తే రూ.25 నుంచి రూ.30 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఢిల్లీ వాసులు కృత్రిమ వర్షంపై పెట్టుకున్న ఆశలు వర్షం రాకముందే ఎండిపోయినట్లయ్యాయి.

# తిరుపతిలో యువతి ఆత్మహత్య

**పెళ్లి కాకపోవడమే కారణం..?**



**తిరుపతి, అక్టోబర్ 30:**
పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో ఓ యువతి ప్రాణాలు తీసుకున్న ఘటన తిరుపతి నగరంలో చోటుచేసుకుంది. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తిరుపతి తాతయ్యగుంట ప్రాంతానికి చెందిన 26 ఏళ్ల లక్ష్మి (పేరు మారింది) గత కొంతకాలంగా వివాహం జరగకపోవడంతో మానసికంగా బాధపడుతుండేది.

కుటుంబ సభ్యులు పలుచోట్ల చూసినప్పటికీ వివాహం స్థిరపడక పోవడంతో ఆమె ఆందోళనకు గురైందని సమాచారం. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో లక్ష్మి గది తలుపు వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిరది. తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు బలవంతంగా తలుపు తెరిచి చూడగా ఆమె ఉరివేసుకున్న స్థితిలో కనిపించింది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక దర్యాప్తులో పెళ్లి కావడం లేదనే నిరాశే ఈ ఆత్మహత్యకు కారణమని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ తెలిపారు. ఈ ఘటనతో తాతయ్యగుంట ప్రాంతంలో దుఃఖ ఛాయలు అలుముకున్నాయి. యువత భవిష్యత్తు పట్ల సమాజం మరింత చైతన్యంగా ఉండాల్సిన అవసరాన్ని ఈ సంఘటన మరోసారి గుర్తు చేసింది.

# రైతు కష్టాలపై స్పందించని ప్రభుత్వం

- ఏపీలో కూటమి పాలన దారుణం
- తుపానుతో కోట్ల రూపాయల నష్టం
- రైతాంగం ఆవేదనలో మునిగింది : వైఎస్ జగన్



**అమరావతి :** రాష్ట్రంలో కూటమి పాలన పూర్తిగా విఫలమైందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. మొంథా తుపాన్ ప్రభావంతో నష్టపోయిన పంటలపై ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేసిందని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పార్టీ శ్రేణులతో మాట్లాడుతూ బాధిత రైతులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. జగన్ వివరించిన ప్రకారం రాష్ట్రంలో 25 జిల్లాల్లో 15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అందులో 11 లక్షల ఎకరాల్లో వరి, 1.15 లక్షల ఎకరాల్లో వేరుశనగ, 2 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 1.14 లక్షల ఎకరాల్లో పత్తి పంటలకు తీవ్ర నష్టం సంభవించిందన్నారు. పైరు పొట్టదశలో ఉన్నప్పుడు వచ్చిన తుపానుతో రైతులు ఆర్థికంగా నిండా కుంగిపోయారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు విపత్కర పరిస్థితుల్లో రైతులకు బలంగా నిలిచాయని, కానీ ప్రస్తుత కూటమి పాలనలో అవి పేరు మాత్రమే మిగిలిపోయాయని జగన్ అన్నారు. గతంలో ఉచిత పంటల బీమా ద్వారా 83 లక్షల మందికి రక్షణ కల్పించగా, ఇప్పుడు కేవలం 19 లక్షల మందికే ప్రీమియం చెల్లించారని విమర్శించారు. కూటమి పాలనలో 16 నెలల్లో 16 తుపాన్లు, వాయుగుండాలు, అల్పపీడనాలు వచ్చినా రైతులకు ఎలాంటి సాయం చేయలేదని జగన్ మండిపడ్డారు. రైతాంగానికి అండగా నిలిచే ధైర్యం ఈ ప్రభుత్వానికి లేదని వ్యాఖ్యానించారు. రైతుల కష్టాల్ని గుర్తించని ఈ పాలనను ప్రజలు ఖండిరచాలని పిలుపునిచ్చారు.

# సహజంగా మగ్గిన మామిడిపండ్లు

## గుర్తించడం ఎలా, ఏవి ప్రమాదం?



వేసవి వచ్చిందంటే చాలు, మామిడిపండ్ల రాయల్టీ మొదలైనట్లే. నోరూరించే మామిడి పండ్లను ఆస్వాదించాలని అందరూ ఆరాటపడతారు. అయితే, మార్కెట్లో లభించే అన్ని మామిడిపండ్లు సహజంగా పండినవి కావు. త్వరగా సొమ్ము చేసుకోవాలనే అత్యాశతో కొందరు వ్యాపారులు రసాయనాలను ఉపయోగించి కాయలను కృత్రిమంగా పండిస్తున్నారు. ఇలా రసాయనాలతో పండిన మామిడిపండ్లు ఆరోగ్యానికి హానికరం. కాబట్టి, సహజంగా మగ్గిన మామిడిపండ్లను ఎలా గుర్తించాలి, రసాయనాలతో పండినవి ఎందుకు ప్రమాదకరమో తెలుసుకుందాం.

**సహజంగా మగ్గిన మామిడిపండ్లను గుర్తించడం ఎలా?**

సహజంగా పండిన మామిడిపండ్లను కొన్ని సులభమైన పద్ధతుల ద్వారా గుర్తించవచ్చు

**రంగు:**

సహజంగా పండిన మామిడిపండ్లు ఒకే రంగులో కాకుండా, పసుపు మరియు ఆకుపచ్చ రంగుల మిశ్రమంతో లేదా కొన్నిసార్లు ఎరుపు రంగుతో కూడి ఉంటాయి. రసాయనాలతో పండినవి పండు మొత్తం ఒకే ప్రకాశవంతమైన పసుపు రంగులో కనిపిస్తాయి, అక్కడక్కడ ఆకుపచ్చ లేదా నల్లటి మచ్చలు ఉండవచ్చు. వాసన: సహజంగా పండిన మామిడిపండ్ల నుండి మధురమైన, సహజ సిద్ధమైన వాసన వస్తుంది. రసాయనాలతో పండిన పండ్ల నుండి ఘాటైన వాసన రావచ్చు, లేదా అసలు వాసనే రాకపోవచ్చు.

**తాకి చూడటం:**

సహజంగా పండిన మామిడిపండును నొక్కితే కొద్దిగా మెత్తగా అనిపిస్తుంది. రసాయనాలతో పండినవి ఎక్కువగా మెత్తగా లేదా అసహజంగా గట్టిగా ఉండవచ్చు.

**రుచి:**

సహజంగా పండిన మామిడిపండ్లు చాలా తియ్యగా, పులుపు లేకుండా ఉంటాయి. రసాయనాలతో పండినవి అంత తియ్యగా ఉండవు, కొన్నిసార్లు కొద్దిగా పులుపు ఉండవచ్చు. వీటిని తిన్నప్పుడు నోరు లేదా గొంతులో మంటగా అనిపించవచ్చు.

**గుజ్జు:**

సహజంగా పండిన మామిడిపండు లోపల గుజ్జు ప్రకాశవంతమైన ఎరుపు లేదా పసుపు రంగులో, రసంతో నిండి ఉంటుంది. రసాయనాలతో పండిన పండు గుజ్జు లేత పసుపు లేదా ముదురు పసుపు రంగులో ఉండి, రసం తక్కువగా ఉంటుంది. గుజ్జు అంతా ఒకే విధంగా పండి ఉండదు.

**నీటి పరీక్ష (ఫ్లోట్ టెస్ట్):**

ఒక బకెట్ నిండా నీరు తీసుకుని, అందులో మామిడిపండ్లను వేయండి. సహజంగా పండిన మామిడిపండ్లు నీటిలో మునిగిపోతాయి. రసాయనాలతో పండినవి నీటిపై తేలుతాయి.

**బేకింగ్ సోడా పరీక్ష:**

ఒక గిన్నెలో నీరు తీసుకుని, కొద్దిగా బేకింగ్ సోడా కలపండి. అందులో మామిడిపండును ఒక నిమిషం పాటు ఉంచండి. ఆ తర్వాత పండును కడిగి చూడండి. పండు రంగు మారితే అది రసాయనాలతో పండినట్లు అనుమానించవచ్చు.

**కృత్రిమంగా పండించడానికి ఉపయోగించే రసాయనాలు మరియు ప్రమాదాలు:**

మామిడిపండ్లను కృత్రిమంగా పండించడానికి ఎక్కువగా ఉపయోగించే రసాయనం కాల్షియం కార్బైడ్. ఇది వాతావరణంలోని తేమతో చర్య జరిపి ఎసిటిలీన్ వాయువును విడుదల చేస్తుంది. ఈ వాయువు పండ్లను త్వరగా పక్వానికి వచ్చేలా చేస్తుంది. అయితే, పారిశ్రామిక స్థాయిలో ఉపయోగించే కాల్షియం కార్బైడ్‌లో ఆర్సెనిక్, ఫాస్ఫరస్ వంటి హానికరమైన మలినాలు ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి అత్యంత ప్రమాదకరం.

**కాల్షియం కార్బైడ్ తో పండిన మామిడిపండ్లను తినడం వల్ల కలిగే ప్రమాదాలు:**

**నాడీ వ్యవస్థపై ప్రభావం:**

ఎసిటిలీన్ వాయువు నాడీ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. మైకం, తలనొప్పి, నిద్రలేమి, మానసిక గందరగోళం వంటి సమస్యలు తలెత్తవచ్చు.

**జీర్ణ సమస్యలు:**

కడుపు నొప్పి, వికారం, వాంతులు, డయేరియా వంటి జీర్ణ సంబంధిత సమస్యలు ఎదురవ్వవచ్చు.

**చర్మ సమస్యలు:**

చర్మంపై దద్దుర్లు లేదా పుండ్లు ఏర్పడవచ్చు.


దీర్ఘకాలిక అనారోగ్యాలు: కాల్షియం కార్బైడ్ లోని మలినాలు కాలేయం మరియు కిడ్నీలపై ప్రభావం చూపవచ్చు. కొన్ని అధ్యయనాలు క్యాన్సర్ కణాల పెరుగుదలను ప్రేరేపించవచ్చని సూచిస్తున్నాయి.

మింగడంలో ఇబ్బంది, అధిక దాహం, బలహీనత వంటి లక్షణాలు కూడా కనిపించవచ్చు. భారతదేశంలో కాల్షియం కార్బైడ్ ను ఉపయోగించి పండ్లను పండించడం నిషేధించబడింది. పండ్లను పండించడానికి ఇథిలీన్ వాయువును ఉపయోగించడానికి అనుమతి ఉంది, ఇది సహజంగా పండ్లలో ఉత్పత్తి అయ్యే హార్మోన్ మరియు ఆరోగ్యానికి అంతగా హానికరం కాదు. మామిడిపండ్ల సీజన్లో వాటిని ఆస్వాదించడం ముఖ్యం, కానీ ఆరోగ్యానికి హాని కలగకుండా జాగ్రత్త పడటం అంతే ముఖ్యం. మామిడిపండ్లను కొనుగోలు చేసేటప్పుడు వాటి రంగు, వాసన, మెత్తదనం వంటి లక్షణాలను జాగ్రత్తగా గమనించండి. వీలైతే, నీటి పరీక్ష వంటివి చేసి నిర్ధారించుకోండి. సహజంగా పండిన మామిడిపండ్లనే ఎంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చు. ఒకవేళ రసాయనాలతో పండించినవి అని అనుమానం వస్తే, వాటిని పూర్తిగా కడిగి, ముఖ్యంగా గోరువెచ్చని నీటిలో కొంతసేపు ఉంచి తినడం మంచిది. అయినప్పటికీ, రసాయనాలతో పండిన పండ్లకు దూరంగా ఉండటమే ఉత్తమ మార్గం.

## అవాంఛిత రోమాలతో బాధపడుతున్న మహిళలు..

# ఈ చిట్కాలను పాటించాలి..!

అవాంఛిత రోమాల సమస్యతో చాలా మంది మహిళలు బాధపడుతుంటారు.



ముఖంపై అవాంఛిత రోమాలు ఎక్కడ ఉన్నా కూడా అంద విహీనంగా కనిపిస్తారని ఆత్మన్యూనతకు లోనవుతుంటారు. అందులో భాగంగానే అన్‌వాంటెడ్ హెయిర్‌ను తొలగించుకోవడానికి ఖరీదైన బ్యూటీ పార్లర్ చికిత్సలను పాటిస్తుంటారు. అయితే ఇందుకు అంత శ్రమించాల్సిన పనిలేదు. మన ఇంట్లో ఉండే పదార్థాలతోనే సహజసిద్ధంగా అవాంఛిత రోమాలను తొలగించుకోవచ్చని బ్యూటీ ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. కొన్ని రకాల పదార్థాలను ఉపయోగించి ఇంటి చిట్కాలను పాటిస్తే అవాంఛిత రోమాలను సులభంగా తొలగించుకోవచ్చని వారు అంటున్నారు. ఇందుకు గాను ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**చక్కెర, నిమ్మరసం మిశ్రమం..**

2 టేబుల్ స్పూన్ల చక్కెర, 2 టేబుల్ స్పూన్ల నిమ్మరసం, 8 టేబుల్ స్పూన్ల నీళ్లను కలిపి ఈ మిశ్రమాన్ని పాన్‌లో వేసి సన్నని మంటపై వేడి చేయాలి. కొంత సేపటికి చక్కెర పూర్తిగా కరిగిపోతుంది. జెల్ లాంటి పదార్థం ఏర్పడుతుంది. ఇది కాస్త వేడిగా ఉండగానే అవాంఛిత రోమాలు ఉన్న చోట రాయాలి. అనంతరం దానిపై ఒక శుభ్రమైన వస్త్రాన్ని ఉంచాలి. కాస్త ఆరాక వెంటనే వస్త్రాన్ని లాగాలి. దీంతో అవాంఛిత రోమాలు ఊడిపోయి వచ్చేస్తాయి. తరువాత నీళ్లతో కడిగేసి మాయిశ్చరైజర్‌ను రాసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే అవాంఛిత రోమాల సమస్య ఉండదు. అయితే ఈ చిట్కా కొందరికి పడకపోవచ్చు. సున్నితమైన చర్మం ఉన్నవారు ఈ చిట్కాను పాటించకపోవడమే మంచిది.

**తేనె, నిమ్మరసం..**

1 టేబుల్ స్పూన్ తేనె, 1 టేబుల్ స్పూన్ నిమ్మరసం తీసుకుని బాగా కలిపి అవాంఛిత రోమాలు ఉన్న చోట రాయాలి. 20 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. ఇలా రోజూ చేస్తుంటే అవాంఛిత రోమాలు రాలిపోతాయి. ఈ చిట్కా కాస్త ఆలస్యంగా పనిచేస్తుంది. కానీ చక్కని ఫలితాలను ఇస్తుంది. పైగా ఎలాంటి నొప్పి, బాధ ఉండవు. అలాగే 1-2 టేబుల్ స్పూన్ల పసుపులో కాస్త పాలు లేదా పెరుగు కలిపి మెత్తని పేస్ట్‌లా తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని సంబంధిత చోట్ల రాయాలి. పూర్తిగా తడి ఆరిపోయాక స్క్రబ్ చేస్తూ కడిగేయాలి. ఈ చిట్కా కూడా అవాంఛిత రోమాలను తొలగించడంలో అద్భుతంగానే పనిచేస్తుంది.

**బొప్పాయి పండు మిశ్రమం..**

1 లేదా 2 టేబుల్ స్పూన్ల బొప్పాయి పండు గుజ్జును తీసుకుని అందులో కాస్త పసుపు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని సంబంధిత చోట్ల రాయాలి. 20 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. వారంలో 2-3 సార్లు ఈ చిట్కాను పాటించాలి. ఇలా తరచూ చేస్తుంటే సమస్య తగ్గిపోతుంది. 1 ఎగ్ వైట్‌ను తీసుకుని అందులో 1 టేబుల్ స్పూన్ చక్కెర, అర టేబుల్ స్పూన్ కార్న్ ఫ్లోర్ ను వేసి మెత్తని పేస్ట్‌లా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని రాసి పూర్తిగా పొడిగా మారిన తరువాత స్క్రబ్ చేస్తూ కడిగేయాలి. ఇలా తరచూ చేస్తున్నా కూడా అవాంఛిత రోమాలను సులభంగా తొలగించుకోవచ్చు. 2 టేబుల్ స్పూన్ల శనగపిండిలో తగినంత నీళ్లు, రోజ్ వాటర్ వేసి కలిపి అందులోనే కాస్త పసుపును కూడా వేసి కలిపి మెత్తని పేస్ట్‌లా మార్చాలి. దీన్ని రాస్తున్నా కూడా అన్‌వాంటెడ్ హెయిర్ తొలగిపోతుంది. ఇలా ఈ చిట్కాలను పాటిస్తే సమస్య తగ్గడంతోపాటు ముఖం అందంగా కూడా మారుతుంది.

## డయాబెటిస్ ఉన్నవారికి

# వరం ఈ ఆకులు..

### ఇంకా ఎన్నో లాభాలను పొందవచ్చు..

పొడపత్రి ఆకు.. దీన్నే కేరళ జిన్సెంగ్ అని, బ్రహ్మ మూలిక అని కూడా పిలుస్తారు. ఈ మొక్క మన దేశంలోని పశ్చిమ కనుమల్లో ఎక్కువగా పెరుగుతుంది. కేరళలో ఈ మొక్కలు మనకు ఎక్కడ చూసినా కనిపిస్తాయి. ఆయుర్వేదంలో ఈ మొక్క ఆకులను ఎంతో పురాతన కాలం నుంచే ఉపయోగిస్తున్నారు. ఈ మొక్క ఆకులు మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. పొడపత్రి ఆకులను నేరుగా తినవచ్చు. లేదా రసం చేసి కొద్ది మొత్తాల్లో తాగవచ్చు. పొడ పత్రి ఆకులను తీసుకోవడం వల్ల శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. అలసట, నీరసం తగ్గుతాయి. ఒత్తిడి, ఆందోళ నుంచి ఉపశమనం లభిస్తుంది. పొడపత్రి ఆకులను తీసుకోవడం వల్ల పురుషుల్లో శృంగార సామర్థ్యం పెరుగుతుంది. శృంగారంలో చురుగ్గా పాల్గొంటారు. ఇందుకు గాను ఆకులను రాత్రి పూట తినాల్సి ఉంటుంది.

**ఆర్థరైటిస్ నొప్పులకు..**

పొడపత్రి ఆకుల్లో ఇమ్యునో మాడ్యులేటరీ గుణాలు సమృద్ధిగా ఉన్నాయి. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం ఈ ఆకులను తినడం వల్ల రోగ నిరోధక వ్యవస్థ బలంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు త్వరగా తగ్గిపోతాయి. పొడపత్రి ఆకుల్లో బయో యాక్టివ్ సమ్మేళనాలు అధికంగా ఉన్నాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్ల మాదిరిగా పనిచేస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి శరీరాన్ని రక్షిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలించడంతోపాటు కణాలను రక్షిస్తాయి. దీంతో క్యాన్సర్, గుండె జబ్బుల వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. పొడపత్రి ఆకుల్లో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయని సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాల్లో తేలింది. అందువల్ల ఈ ఆకులను తింటే వాపులు, నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

**డయాబెటిస్ సమస్యకు..**

పొడపత్రి ఆకుల్లో యాంటీ ఫాటిగ్ గుణాలు సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల ఈ ఆకులను తింటే ఎంతటి నీరసం, అలసట అయినా త్వరగా తగ్గిపోతాయి. మళ్లీ చురుగ్గా మారుతారు. ఉత్సాహంగా పనిచేస్తారు. యాక్టివ్‌గా ఉంటారు. పొడపత్రి ఆకుల్లో న్యూరో ప్రొటెక్టివ్ గుణాలు ఉంటాయి. కనుక ఈ ఆకులను తింటే నరాల బలహీనత తగ్గుతుంది. నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. పొడపత్రి ఆకులను షుగర్ ఉన్నవారికి వరంగా చెప్పవచ్చు. ఈ



ఆకులను తింటే షుగర్ లెవల్స్ క్రమంగా తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. ఈ ఆకులను తినడం వల్ల పిండి పదార్థాలు నెమ్మదిగా రక్తంలో కలుస్తాయి. దీంతో షుగర్‌ను ఎల్లప్పుడూ అదుపులో ఉంచుకోవచ్చు.

**జాగ్రత్త అవసరం..**

పొడపత్రి ఆకులను నేరుగా తినవచ్చు. లేదా రసం తీసి తాగవచ్చు. కానీ స్వల్ప మొత్తాల్లో తీసుకోవాల్సి ఉంటుంది. ఇది వ్యక్తి శరీర తత్వం, ఉన్న వ్యాధిని బట్టి మారుతుంది. కనుక ఈ ఆకులను వాడాలనుకుంటే ఆయుర్వేద వైద్యుల సలహా తీసుకోవాలి. ఒకటి లేదా రెండు ఆకులను తినడం, ఒక టీస్పూన్ రసం సేవించడం సురక్షితంగా భావిస్తారు. పలు రకాల ఆయుర్వేద ఔషధాల తయారీలోనూ పొడపత్రి ఆకులను విరివిగా ఉపయోగిస్తారు. రాత్రి పూట పొడపత్రి ఆకులను పాలతో తీసుకుంటే పురుషులకు మేలు జరుగుతుంది. గాయాలు, పుండ్లు, చర్మ సమస్యలను తగ్గించేందుకు కూడా ఈ ఆకులను ఉపయోగించవచ్చు. కొద్దిగా పేస్ట్‌లా చేసి ఈ ఆకులను రాస్తుంటే గాయాలు, పుండ్లు త్వరగా తగ్గుతాయి. అయితే అలర్జీలు ఉన్నవారు ఈ ఆకులను వాడకూడదు.

# పోడు జీవుల గోడు...



అటవీభూముల విషయంలో కాంగ్రెస్ సర్కారు రెండు నాల్కల ధోరణి విస్మయం కలిగిస్తున్నది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని అటవీ ప్రాంతాన్ని చెరబట్టబోయి భంగపడిన సంగతి తెలిసిందే. అదే సర్కారు గిరిజన ప్రాంతాల్లోని భూములను అటవీ భూములంటూ నానా హంగామా చేస్తున్నది. అడవిబిడ్డలను కడగండ్లపాలు చేస్తున్నది. ఈ ప్రభుత్వ హయాంలో జరిగిన్న ఘోర దురాగతాలు ఇన్నీఅన్నీ కావు. విద్యార్థులు, బుద్ధిజీవులు కలిసిపోరాడితే గానీ కేంద్ర వర్సిటీ భూములను కాపాడుకోవడం సాధ్యపడలేదు. కానీ, అమాయక గిరిజనుల విషయం అలా కాదు. కొండల్లో, కోనల్లో జీవనం సాగించే అడవి బిడ్డలు పోడు భూములను కాపాడుకునేందుకు నానా అగచాట్లు అనుభవించాల్సి వస్తున్నది. పోలీసుల బూట్ల కింద తండాలు, గూడేలు నలిగిపోతున్నాయి. ప్రతిఘటిస్తే దయాదాక్షిణ్యాలు చూపకుండా, ఆడామగా అనే తేడా లేకుండా నరకం చూపిస్తున్నారు. నిన్నామొన్నటి లగచర్ల నుంచి రంగంపేట, కోసగుంపు వరకు ఇదే తతంగం. 'ప్రాణాలైనా వదులుకుంటం కానీ భూములను వదులుకోబోమ'ని గిరిజనులు అంటే సర్కారు పోలీసు లాఠీని ప్రయోగించి దమనకాండకు దిగుతున్నది. వారు మన పౌరులు, మనం కాపాడాల్సిన పౌరులు అనే స్పృహ లేకుండా తరిమితరిమి కొడుతున్నది. మహిళలపై హింస ప్రయోగించడం సర్కారు కర్కశత్వానికి పరాకాష్ఠ. ఇది ఏ తరహా ప్రజాపాలన? మొన్నటికిమొన్న రాజన్న సిరిసిల్లా జిల్లాలోని రంగంపల్లిలో పోడు భూములపైకి సర్కారు దండెత్తింది. ఎవుసమే జీవనాధారంగా బతికే రైతన్నల నోటికాడి ముద్ద ఎత్తగొట్టేందుకు సమకట్టింది. ఇంకా పట్టాలివ్వని పోడు భూములను అటవీ భూములంటూ వితండవాదం ముందుకుతెచ్చింది. ప్లాంటేషన్ పేరుతో లాగేసుకునేందుకు సర్కారు ఎత్తులు వేసింది. ఊరు ఊరంతా ఒక్కటై ఎదురుతిరగడంతో తోకముడిచింది. ఇక భద్రాద్రి జిల్లా కోసగుంపులో జరిగిన దారుణాలు లగచర్ల దురాగతాలను మరిపించేలా ఉన్నాయి. శత్రు దేశంపైకి శతఘ్నులు తోలినట్టుగా అక్కడి భూములపైకి సర్కారు జేసీబీలతో దండెత్తింది. ఇదేమిటని ప్రశ్నించిన గిరిజన మహిళలతో ఖాకీలు వ్యవహరించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉంది. ఎప్పటినుంచో సాగు చేసుకుంటున్న భూముల్లోకి ఎందుకు వచ్చారని ప్రశ్నిస్తే నాటిన విత్తనాలు తవ్విపోస్తామంటూ రెచ్చిపోయారు. నిస్సహాయ మహిళలపై కీచకపర్వం సాగించడం పరమ దుర్మార్గం. 18 నెలల పాలనలో ఆదివాసీ గూడేలపై 22 దాడులు జరగడం దారుణం. ఇదేనా కాంగ్రెస్ తెస్తానన్న మార్పు? నిజమే. ఇదివరకటి బీఆర్ఎస్ పాలన ఎక్కడ? ఇప్పటి కాంగ్రెస్ పాలన ఎక్కడ? ఎంత తేడా. ఎక్కడి నుంచి ఎక్కడకు పడిపోయామని ప్రజలు వాపోతున్నారు. సుదీర్ఘకాలంగా తండాలు, గూడేలు కోరుకున్న స్వయంపాలన అవకాశాలు కల్పిస్తూ వాటిని గ్రామ పంచాయతీలుగా అభివృద్ధి చేసింది కేసీఆర్ ప్రభుత్వం. 'మావ నాటే మావ రాజ్' నినాదాన్ని నిజం చేసింది. జీవనాధారమైన పోడు భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తూ గిరిపుత్రులకు పట్టాలు పంపిణీ చేసి రికార్డు సృష్టించింది. 'మావ జమీన్.. మావ పట్టా' నినాదాన్ని సాకారం చేసి దేశానికే ఆదర్శంగా నిలిచింది. దేశవ్యాప్తంగా అటవీ హక్కుల చట్టం అమల్లోకి వచ్చాక ఏకకాలంలో నాలుగు లక్షల పైచిలుకు ఎకరాలకు పట్టాలు పంపిణీ చేయడం ఓ చరిత్ర. ప్రస్తుత కాంగ్రెస్ మంత్రి సీతక్క తల్లిదండ్రులు కూడా లబ్ధిదారుల్లో ఉండటం విశేషం. గిరిపుత్రులు ప్రశాంతంగా వ్యవసాయం చేసుకుని హాయిగా జీవిస్తారనే చల్లని తలంపుతో ఈ మార్పులు ప్రవేశపెట్టింది బీఆర్ఎస్ సర్కారు. అందుకు భిన్నంగా కాంగ్రెస్ సర్కారు గిరిజనులను వారికి ప్రాణసమానమైన భూమికి దూరం చేసేందుకు వికృత మార్గాలు అనుసరించడం దుర్మార్గం.

# మద్దతు ధరల మర్మం !



కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన సాగుచట్టాలను రద్దు చేసినా..రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదు. వ్యవసాయాన్ని ఆదాయం వచ్చేలా తీర్చిదిద్దుతామన్న హామీ మేరకు నిర్ణయాలు తీసుకోవడం లేదు. సాగుచట్టాలను రద్దు చేయాలని ఉద్యమిస్తే తప్ప ..ఆ ఉద్యమ ఉధృతికి తాళలేక చివరికి వాటిని ఉపసంహరించుకొంటున్నట్టు మోడీ ప్రకటించారు. ప్రధాని మోడీ దేశానికి క్షమాపణలు చెప్పుకొన్నారు. కానీ ఏడాదిపాటు రైతులు ఉద్యమించడం వల్ల ఎందరో బలయ్యారు. ఈనిపై కించిత్తు కూడా విచారం వ్యక్తం కాలేదు. ఈ సందర్భంగా మొత్తం 23 పంటలకు మద్దతు ధరల హామీ ఇస్తూ చట్టాన్ని చేయాలన్న అన్నదాతల అసలు డిమాండ్ ఇంత వరకు నెరవేరలేదు. దీనిపై చర్చలు జరిపి చట్టాన్ని తెస్తామని ఇచ్చిన హామీని ప్రధాని మోడీ ప్రభుత్వం మరిచిపోయింది. ఇతర అన్ని సరకులకు, సామగ్రికి లాభసాటి ధరలను నిర్ణయించి అమ్ముకొనే స్వేచ్ఛ వాటి ఉత్పత్తిదారులకు వుండగా, ఒక్క వ్యవసాయ ఉత్పత్తుల విషయంలోనే రైతుకు అటువంటి స్వేచ్ఛ లేకపోడం దారుణం.అన్నదాతలు చేసుకున్న పాపామో ఏమో కానీ మద్దతు ధరల కోసం ఏటా ఎదురుచూపులే. అన్యాయంగా రైతుల శ్రమ మీద దళారులు బాగు పడుతున్నారు. పంటలు పండించిన రైతులు మాత్రం రోజురోజుకీ కుంగిపోతున్నారు. ఈ దుస్థితి తొలగా లంటే స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసిన విధంగా అసలు ఖర్చుకి రైతు ఇంటిల్లిపాది చేసే శ్రమ విలువ ను కూడా చేర్చి ఆ మొత్తానికి ఒకటిన్నర రెట్లు మద్దతు ధరగా నిర్ణయించవలసి వుంది.

రైతు కోసం ఏదైనా చేస్తామంటారు గాని, స్వామినాథన్ కమిషన్ సిఫారసు యధాతథంగా ఇంత వరకు అమలు చేయలేక పోతున్నారు. బహుళజాతి కంపెనీలకూ ఎర్రతివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. నిజానికి కంపెనీలకు మించిన ఆదాయాన్ని, ఉద్యోగ కల్పనను వ్యవసాయరంగమే కల్పిస్తోంది. వ్యవసాయానికి పెద్దపీట వేసివుంటే ఈ రంగం దేశ ఆర్థిక పురోగతిలో కీలకం అయ్యేది. అనేక కంపెనీలకు ఇస్తున్న రాయితీల మాదిరి వ్యవసాయా నికి కూడా రాయితీలు ఇచ్చి పంటల ఉత్పత్తిని సవాల్‌గా తీసుకోవాలి.. సేంద్రియ వ్యవసాయానికి చేయూతను ఇవ్వాలి. అలాగే దేశంలో ఉన్న వ్యవసాయభూముల్లో ఎక్కడెక్కడ ఏ పంట పండుతుందో తెలుసు కనుక అందుకు అనుగుణంగా పంటల విధానం తీసుకుని రావాలి. అయితే రైతులను ఓటు బ్యాంకుగా చూడడం అలవాటు చేసుకున్న పాలకులు వారిని దేశంలో ఆర్థికరంగంలో కీలకమైన వ్యక్తులుగా చూడడం లేదు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టి యువతను ప్రోత్సహించడం ద్వారా నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టవచ్చు. కానీ అలా జరగడం లేదు. సస్యవిప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకోవాల్సిన తరుణంలో వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. దేశీయంగా వ్యవసాయ పురోభివృద్ధికి పాటుపడడం లేదని వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అలా చేయడం వల్ల వ్యవసాయం రంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారగలదని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే మంచిదని అంటున్నారు. అయితే అలాంటిదేమీ లేకపోగా కంటితుడుపు చర్యలతో కాలం నెట్టు కొస్తున్నారు. ఇటీవల చెరకు మద్దతు ధరలను పెంచారు. చెరకు ధరను రూ. 10 పెంచి క్వింటాలు రూ. 315కి చేర్చింది. యూరియా సబ్సిడీని కొనసాగించాలని నిర్ణయించింది. సేంద్రియ ఎరువుల ఉత్పత్తిని ప్రోత్సహిం చడానికి ప్రత్యేక పథకాన్ని అమలు చేయదలచింది. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయాలను తీసుకొన్నది. 2024 ఏప్రిల్‌లో వచ్చే చెరకు పంటకు ఈ కొత్త ధర వర్తిస్తుంది. వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో వుంచుకొని ఈ నిర్ణయాలు తీసుకొన్నట్టు బోధపడుతున్నది. చెరకు అత్యధికంగా పండించే రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో వుండగా, రెండో స్థానంలో మహారాష్ట్ర, మూడో స్థానంలో కర్ణాటక వున్నాయి. ఇక్కడ రైతులను మచ్చిక చేసుకునేందుకే ఈ పెంపు ప్రతిపాదన అన్నది వేరుగా చెప్ప నక్కర్లేదు. అయితే స్వాతంత్య వజ్రోత్సవాల బహుమతిగా 2022 23 ఆర్థిక సంవత్సరంలోనే దేశంలోని రైతుల అందరి ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని ప్రధాని మోడీ చేసిన వాగ్దానం మరచిపోయారు. సంస్థాగత రుణాలు అందుబాటులో లేక, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దయాదాక్షిణ్యాల మీద ఆధార పడుతున్నందున రైతులు సాగు మీద సంపాదిస్తున్న దానికి, తీర్చవలసిన అప్పుకి లంకె కుదరడం లేదు. వ్యవసాయ ఆదాయానికి మించి అప్పులు పేరుకుపోడంతో వున్న ఎకరా, అర ఎకరా భూమిని అమ్ముకొని కౌలు రైతులుగానో, వ్యవసాయ కార్మికులుగానో మారిపోతున్న రైతులు దేశంలో ఎంతో మంది వున్నారు. ఆడపిల్ల పెళ్ళి చేయలేక ఉరి తాడును ఆశ్రయిస్తున్న వారున్నారు. రైతులకు ఇంత చేశాం, అంత చేశాం అని చెప్పుకొనే కేంద్ర ప్రభుత్వం 2020 ఆగస్టు నుంచి 2021 డిసెంబర్ వరకు దాదాపు ఏడాదిన్నర కాలం ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన చరిత్రాత్మకమైన రైతు ఉద్యమం వల్ల రైతులకు గట్టిగా చేసిందేమీ లేదు. మూడు నల్ల చట్టాలను వారి ముందు ఉరి తాళ్ళ మాదిరిగా వేలాడ దీసి రెచ్చగొట్టి ఉద్యమంలోకి లాగిన తీరును దేశం ఇంకా మరచిపోలేదు. ఈ క్రమంలో మద్దతు ధరలు మరింతగా పెరగాలి. వ్యయసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి. వారికి కావాలసిన వసతులను సమకూర్చి దేశంలో దీనిని అగ్రగామిగా నిలబెట్టాలి. అంతేకా కుండా... ఆదాయవనరుగా తీర్చిదిద్ది నిరుద్యోగాన్ని నిర్మూలించేలా చేయాలి. వ్యవసాయ అనుబంధ రంగాలను మరింతగా ప్రోత్సహించాలి. అప్పుడే వ్యవసాయం బతికిబట్ట కలదు. తాజాగా చెరకుకే కాకుండా మిగతా పంటలకు కూడా మద్దతు ధరలను పెంచాలి.

# కార్పొరేట్ కులతత్వం



జిలుగువెలుగుల కార్పొరేట్ ప్రపంచం అడుగున కులతత్వం కుళ్లు కంపు కొడుతున్నదా? మడతలు నలగని సూటూబూటూ కింద సంకుచిత కులాధిపత్యం పాకుతున్నదా? లేక వేళ్లూనుకొని కుక్కమూతి పిందెలు వేస్తున్నదా? ఇండిగో సంస్థలో ఓ ఉద్యోగికి ఎదురైన చేదు అనుభవం జాతిని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇంకా వెనుకబాటుతనం పూర్తిగా మాసిపోని పల్లెటూళ్లలోనో, ఆధిపత్యవాదం రాజ్యమేలే గొప్పగొప్ప విద్యాసంస్థల్లోనో కులతత్వం ఉందంటే నిజమే అనుకోవచ్చు. అందుకు సంబంధించిన వార్తలు మనం తరచుగా వింటూనే ఉంటాం. దేశంలోని అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో చాలా చోట్ల దళిత పెండ్లిళ్లలో వరుడు గుర్రమెక్కి ఊరేగడం ప్రాణాంతకమే. పేరుమోసిన వర్సిటీల్లో దళిత బిడ్డలు వేధింపులు భరించలేక ఉసురు తీసుకునే ఉదంతాలు మన దృష్టికి ఇంకా వస్తూనే ఉన్నాయి. ఇది నవభారతం మోస్తున్న నిన్నటి శాపం, రేపటి పాపం. ఒక కార్పొరేట్ సంస్థలో 'నువ్వు అధముడివి, విమానాలు నడపడంతో నీకేం పని.. పోయి చెప్పులు కుట్టుకో' అని తోటి ఉద్యోగులు ఓ దళిత బహుజన పైలట్‌ను దారుణంగా అవమానించడం ఏమిటి? చెప్పులు కుట్టే చేతులు విమానాలు నడపొద్దని రాజ్యాంగం ఏమైనా చెప్తున్నదా? భారతదేశానికి కులవివక్ష కొత్త కాదు. కానీ, కార్పొరేట్ తెరమీద అది మరీ ప్రస్ఫుటంగా ప్రత్యక్షం కావడం ఆలోచింపజేస్తున్నది. ఉద్యోగి తన బాస్‌ల మీద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దాఖలైంది. విచారణలో ఏం తేలుతుందనేది వేరే సంగతి. కానీ, ఈ ఘటనతో కార్పొరేట్ ప్రపంచంలో కులతత్వంపైకి అందరి దృష్టి మళ్లింది. ఆర్థిక సరళీకరణల భుజాలపై ఊరేగుతూ ప్రపంచీకరణ దూసుకొస్తున్న రోజుల్లో ప్రపంచం ఓ కుగ్రామంలా మారుతున్నదనే మాట తరచుగా వినిపించేది. అడ్డుగోడలు తొలగిపోతున్నాయన్న భావనలు పురివిప్పుకొన్నాయి. భారత్ అంతకంతకూ విశ్వ ఆర్థికవ్యవస్థతో పెనవేసుకుపోతున్న నేపథ్యంలో మన నేతలు తరచుగా వసుధైవ కుటుంబం అనే భావనను పదేపదే ఉల్లేఖించడం పరిపాటి అయిపోయింది. కానీ, ఆ ఉదాత్త భావనను సాధించడానికి భారత్ ఇంకా చాలాచాలా దూరంలో ఉన్నదని ఇటీవల ఈ గడ్డ మీద జరుగుతున్న సంకుచిత కుల వైషమ్యాలు సూచిస్తున్నాయి. ప్రైవేటీకరణ జోరులో విస్తరించిన కార్పొరేట్ ప్రపంచంలో కులాతీత, ప్రజ్ఞ ఆధారిత ప్రోత్సాహమే ఉందనేది సాధారణ అవగాహన. కానీ, ఇండిగో ఉదంతం ఇదంతా భ్రమేనని అంటున్నది. కులవ్యవస్థ అనేది శ్రమ విభజన మాత్రమే కాదని, అది శ్రామికుల విభజన అని అంబేద్కర్ చేసిన సూత్రీకరణ ఇక్కడ గుర్తుకువస్తున్నది. కార్పొరేట్ ఆధిపత్య వ్యవస్థ అన్ని సామాజిక వర్గాలకు సమప్రాధాన్యత ఇచ్చే వ్యవస్థగా రూపొందేందుకు ప్రయత్నిస్తున్న మాట నిజమే. కానీ, ఆ దిశగా నిచ్చెనలు అందుకునేలోగా కులతత్వం పాములు కిందకు ఈడ్చేయకుండా చూసుకోవాలి.

# జలమే మానవాళికి జీవనాధారం

**బెంగళూరు:** బెంగళూరులో నీటి సమస్య తీవ్రం కావడంతో మనమెంతగా దూరదృష్టి లేకుండా మనుగడ



సాగిస్తున్నామో అర్థం చేసుకోవచ్చు. నీటి వనరులను ధ్వంసం చేయడం, చెరువుల, కాలువను ధ్వంసం చేయడం వల్ల తీరని నీటి సమస్యను ఎదుర్కొంటున్నాం. తాగడానికి నానా తంటాలు పడుతున్నాం. కర్నాటక పరిస్థితులు మనకు ఓ హెచ్చరిక కావాలి. నీరు లేనిదే సమస్త జీవ కోటికి మనుగడ లేదు. అసలు జీవ పరిణామం ప్రారంభమైందే సముద్ర గర్భంలో అనే విషయం తెలిసిందే. ఒకప్పుడు పుష్కలంగా లభించే మంచి నీటిని అభివృద్ధి పేరిట కలుషితం చేస్తున్నాం. అవసరానికి మించి వాడుతూ వాటిని వృథా చేస్తున్నాం. దీంతో సమీప భవిష్యత్తులో నీటి కోసం యుద్ధాలు జరిగే రోజులు కూడా రానున్నాయనడంలో ఆశ్చర్యమేమీ లేదంటే అతిశయోక్తి కాదేమో. ఈ పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతోనే ఐక్యారాజ్య సమితి 'ప్రపంచ జల దినోత్సవం' అంటే వరల్డ్ వాటర్ డే ను నిర్వహిస్తున్నది. ప్రతియేటా మార్చి 22న దీనిని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. వరల్డ్ వాటర్ డే.. పది ఆసక్తికర విషయాలు గగమనించాలి. ప్రపంచంలో నేడు ప్రతి ముగ్గురిలో ఒకరికి శుద్ధమైన తాగునీరు దొరకడం లేదు. 2050 నాటికి భూమి మీద నివసిస్తున్న వారిలో సుమారు 5.7 బిలియన్ల అంటే 500 కోట్ల మంది సంవత్సరానికి ఒక నెల పాటు నీటి కొరత ఎదుర్కొన నున్నారని అంచనా. మంచి నీటి సరఫరా, పారిశుధ్యం సక్రమంగా ఉంటే ప్రతి యేటా 3,60,000 వేల మంది శిశువుల ప్రాణాలను కాపాడుకోవచ్చు. గ్లోబల్ వార్మింగ్‌ను పూర్వస్థాయి కంటే 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేస్తే వాతావరణ ప్రేరిత నీటి ఒత్తిడిని 50 శాతం వరకు తగ్గించవచ్చు. గత దశాబ్దంలో 90 శాతానికి పైగా విపత్తులు తీవ్ర వాతావరణ పరిస్థితుల కారణంగానే తలెత్తాయి. 2040 నాటికి ప్రపంచ వ్యాప్తంగా ఇంధన డిమాండ్ 25 శాతానికి, నీటి డిమాండ్ 50 శాతానికి పైగా పెరగనుందని అంచనా. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా అందరికీ నీరు, పారిశుధ్యం కల్పించాలని ఐరాస లక్ష్యంగా పెట్టుకుంది. 2018-2028 దశాబ్దాన్ని 'వాటర్ ఫర్ సస్టెనెబుల్ డెవలప్‌మెంట్'గా ఐరాస జనరల్ అసెంబ్లీ ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాఠశాలలో సగానికంటే ఎక్కువ స్కూళ్లలో విద్యార్థులకు హ్యాండ్ వాషింగ్ సౌకర్యాలు లేవు. కనీసం చేతులు కడుక్కోవడానికి నీరు, సబ్బు కూడా అందుబాటులో లేని స్కూళ్లు కూడా చాలా ఉన్నాయి. అపరిశుభ్రమైన నీరు తాగి ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 2,97,000 మంది అంటే సుమారు రోజుకు 800 మంది పిల్లలు అతిసారం బారిన పడి చనిపోతున్నారు. ఈ కారణాల చేత ప్రతి ఒక్కరూ నీటి ఆవశ్యకతను గుర్తించి వాననీటిని ఒడిసి పట్టడమే కాకుండా,నీటినిజాగ్రత్తగా వాడుకునే విధంగా వ్యవహరించాలి.



## ఈశా ఇల్లుతో సమానం

జీవితంలో ఎదురయ్యే కష్టాలు, ఇబ్బందిపెట్టే సంఘటనలు ఎన్నో పాఠాల్ని నేర్పుతాయని, వాటిని అర్థం చేసుకుంటే మరింత ధైర్యంగా ముందుకు వెళ్లొచ్చని చెప్పింది అగ్ర కథానాయిక సమంత. ఇన్‌స్టాగ్రామ్‌తో అభిమానులతో ముచ్చటించిన ఈ భామ వ్యక్తిగత విషయాలతో పాటు సినిమా సంగతుల్ని కూడా వారితో పంచుకుంది. నేటికాలంలో విద్యార్థులు ఒత్తిడిని జయించడం చాలా ముఖ్యమని, మంచి స్నేహాలు ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసి ఒత్తిడిని దూరం చేస్తాయని, కాలేజీ రోజుల్లోని స్నేహితులు అండగా ఉన్నారు కాబట్టే తాను కష్టాలను జయించానని చెప్పుకొచ్చింది సమంత. ఈషా ఫౌండేషన్‌ను తరచూ సందర్శించడం వెనక ఉద్దేశ్యమేమిటని ఓ అభిమాని అడగ్గా.. ఆ ప్రదేశం తనకు ఇంటితో సమానమని, అక్కడకు వెళ్తే ఏదో తెలియని ప్రశాంతత లభిస్తుందని చెప్పింది. తెలుగులో కొంత గ్యాప్ తీసుకున్నానని, స్వీయ నిర్మాణంలో నటిస్తున్న 'మా ఇంటి బంగారం' చిత్రం ఈ నెలలోనే ప్రారంభమవుతుందని సమంత తెలిపింది. 'మా ఇంటి బంగారం' చిత్రానికి నందిని రెడ్డి దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమాతో పాటు 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' సిరీస్‌లో నటిస్తున్నది సమంత.



## నాకో సవాలు!

'ప్రేమలు' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు చేరువైంది మలయాళీ సోయగం మమిత బైజు. ప్రస్తుతం ఈ భామ 'డ్యూడ్' చిత్రంలో ప్రదీప్ రంగనాథన్ సరసన కథానాయికగా నటిస్తున్నది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా కథానాయిక మమితబైజు చిత్ర విశేషాలను పంచుకుంది. 'ప్రేమలు' విడుదల తర్వాత చిత్ర దర్శకుడు కీర్తిశ్వరన్ తనను సంప్రదించాడని, కథ బాగా నచ్చడంతో వెంటనే అంగీకరించానని చెప్పింది. ఈ సినిమాలో తాను కురల్ అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, కథాగమనంలో తన క్యారెక్టర్‌కు చాలా ప్రాధాన్యత ఉంటుందని పేర్కొంది. 'ఇప్పటివరకు ఈ తరహా పాత్ర చేయలేదు. కురల్ నిజాయితీపరురాలైన అమ్మాయి. తను అందరితో స్నేహంగా ఉంటుంది. ముక్కుసూటిగా మాట్లాడుతుంది. ఈ పాత్ర చేయడం ఓ సవాలు' అని చెప్పింది. ఈ సినిమాలో కొన్ని ఎమోషనల్ సీన్స్‌కు సంబంధించిన సంభాషణలను రాత్రంతా ప్రాక్టీస్ చేశానని, షూటింగ్ వెళ్లే ముందు పూర్తిగా ప్రిపేర్ కావడం అలవాటు చేసుకున్నానని మమితబైజు తెలిపింది.



## కృతిశెట్టి మళ్లీ ట్రాక్‌పైకి వచ్చేనా..?

తొలి సినిమాతోనే తెలుగులో గ్రాండ్ సక్సెస్ అందుకున్న భామల్లో ఒకరు కృతిశెట్టి. ఉప్పెన సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. అద్భుతమైన నటనతో కుర్రకారు మనసు దోచేసిన కృతిశెట్టి ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంది. కానీ ఆ తర్వాత చేసిన సినిమాలు మాత్రం కృతిశెట్టికి నిరాశనే మిగిల్చాయని చెప్పాలి. కృతిశెట్టి హీరోయిన్‌గా నటించిన కస్టడీ, మనమే, ది వారియర్, మాచెర్ల నియోజకవర్గం సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఈ వరుస ఫెయిల్యూర్స్ టాలీవుడ్‌లో కృతిశెట్టి ప్రయాణంపై ప్రభావం చూపించాయి. అయితే ఇక చేసేదేమి లేక తమిళంలో తన లక్‌ను పరీక్షించుకోవాలనుకున్నకృతిశెట్టి అక్కడ మూడు సినిమాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాపులర్ యాక్టర్లతో సినిమాలు చేసి.. షూటింగ్స్ పూర్తి చేసినా పలు కారణాల వల్ల ఆలస్యమవుతూ వచ్చాయి. తీవ్ర నిరాశలో ఉండిపోయిన కృతిశెట్టి అభిమానుల కోసం వరుసగా ఆ సినిమాలు విడుదలకు రెడీ అయ్యాయి. పై మూడు సినిమాలు ఒకేసారి ఒకే నెలలో విడుదలకు ముస్తాబవుతున్నాయి.

### బ్లాక్ డ్రెస్సులో

## జాన్వీ కపూర్ గ్లామర్ షో

ముంబై: జాన్వీ కపూర్ తన ఫ్యాషన్ లుక్స్‌తో స్టన్ చేస్తోంది. జాన్ గల్లియానో బ్లాక్ కలర్ డ్రెస్సులో జిగేల్మంది ఆ బ్యూటీ. 1986 ఫాలన్ ఏంజిల్స్ కలెక్షన్‌కు చెందిన డ్రెస్సింగ్‌ను జాన్వీ ధరించింది. ఫ్రాన్స్ ఉద్యమ కాలంతో 1986 కలెక్షన్‌కు లింకు ఉన్నది. ప్రాచీన గ్రీకు, రోమన్స్‌కు చెందిన సాధారణ స్టయిల్‌లో డ్రెస్సు ఉంటుంది. గల్లియానో డిజైన్‌లో చాలా లైటర్ ఫ్యాబ్రిక్స్ ఉంటాయి. బ్లాక్ చార్‌కోల్ షేడ్‌లో ఉన్న సీజర్ ప్లీట్ డ్రెస్సును జాన్వీ వేసుకున్నది. ఆ ఔట్‌ఫిట్‌కు స్కాలోప్ నెక్‌లైన్ ఉంది. లాంగ్ స్లీవ్స్, కర్వ్ పౌచ్ ప్యాకెట్లు కూడా ఉన్నాయి. ఇక షర్ట్‌కు కూడా క్రాసోవర్ సీజర్ కట్టింగ్‌తో డిజైన్ ఉంది. రియా కపూర్ ఈ డ్రెస్సును స్టయిల్ చేసింది. ఈ ఔట్‌ఫిట్‌కు తగినట్లు హై హీల్స్ వేసుకుంది జాన్వీ. క్లచ్ అండ్ డార్క్ సన్‌గ్లాసెస్ కూడా పెట్టుకుంది ఆ క్యూటీ.



Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

# ఎంత సేవ చేసినా కన్న ఊరి ఋణం తీర్చుకోలేను

## ఎన్ఆర్ఐ దేవిరెడ్డి వీరేందర్ రెడ్డి



యాదాద్రి జిల్లా: రామన్నపేట: తొవ్వ ప్రతినిధి: అక్టోబర్ 30



ఎంత సేవ చేసిన జన్మనిచ్చిన ఋణం తీర్చుకోలేమని మునిపంపుల ఉచిత కంటి పొర చికిత్స శిభిరం నిర్వాహకులు దేవిరెడ్డి వీరేందర్ రెడ్డి (ఎన్ఆర్ఐ) అన్నారు. మునిపంపుల గ్రామంలో మాజీ సర్పంచ్ దేవిరెడ్డి రాంరెడ్డి జ్ఞాపకార్థం భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రంలో శంకర నేత్రలయ చెన్నై డాక్టర్లతో ఈనెల 22వ తేదీ నుండి ప్రారంభమైన ఉచిత కంటిపొర చికిత్స శిభిరం గురువారం రోజు ముగిసింది.శిభిరం ముగింపు సందర్భంగా ఆపరేషన్ చేసుకున్న వారితో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో శిభిరం నిర్వాహకులు మాట్లాడుతూ ఈ ఉచిత కంటి పొర చికిత్స శిభిరంలో మొత్తం 2560 మంది ఒపీ నమోదు చేసుకోగా 2119 మందికి ఉచిత కంటి అద్దాల పంపిణి చేశారు. 122మందికి కంటి ఆపరేషన్ చేశారు. 211మందిని చెన్నై లో శంకర నెత్రాలాయకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కన్న ఊరు ఋణం తీర్చుకోవడం కోసమే ఈ మహత్తర కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, ఊరి కోసం ఇంకా సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు.చికిత్స శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్న ప్రజలకు, నిరాటాంకంగా పని చేసిన వాలంటీర్ల,వివిధ యువజన సంఘాలు, అఖిల పక్ష పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు.దేవిరెడ్డి వీరేందర్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటిపొరా చికిత్స శిభిరంలో గ్రామంలోని యువత భగత్ సింగ్ విజ్ఞానకేంద్రం మరియు భీమ్ ఫాలోవర్స్ వారు 50 మంది స్వచ్ఛందంగా పది రోజులపాటు గ్రామ గ్రామన తిరిగి ప్రచారం నిర్వహించి 20 గ్రామాల నుండి వచ్చిన వారికి పరీక్షలు చేయించి ఉచిత కంటి అద్దాలు పంపిని చేసి భోజనాలు, వసతులు ఏర్పాటు చేశారు.కో-ఆర్డినేటర్ తొలుపునూరి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమలో మాజీ సర్పంచ్ దేవిరెడ్డి సావిత్రమ్మ, దేవిరెడ్డి పద్మ, సమన్వయ కర్తలు బొడ్డుపల్లి వెంకటేశం, గాదె శోభారాణి,శంకర నేత్రలయ కోఆర్డినేటర్ భాను ప్రకాష్,అఖిల పక్ష నాయకులు మన్నెం పద్మారెడ్డి, తాళ్లపల్లి జితేందర్, కట్ట యాదయ్య,గంటెపాక శివ కుమార్,ఉయ్యాల నర్సింహా,ఉడుతల శ్రీనివాస్,తొలుపునూరి శ్రీనివాస్, గాదె కృష్ణ,బూడిద బిక్షం,చింత గిరి బాబు, తుర్కపల్లి నరేష్, యాదాసు అరుణ్,అజయ్,బత్తిని సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ సమగ్రత ఐక్యతా కోసం రన్ ఫర్ యూనిటీ

## – మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



తొవ్వ, మహబూబాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 30:

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని మహబూబాబాద్ జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో 2కె రన్ నిర్వహించడం జరుగుతుందని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలోని అన్ని మండలాల యువతి, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.స్టార్టింగ్ పాయింట్: మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ రన్నింగ్ రూట్: నెహ్రూ సెంటర్, ఏరియా హాస్పిటల్, అండర్ బ్రిడ్జి, ఎఫ్ఆర్ఓ సెంటర్, వివేకానంద సెంటర్.క్లోజింగ్ పాయింట్: ఎన్టీఆర్ స్టేడియం. "దేశ ఐక్యత, సమగ్రతకు గుర్తుగా జరుపుకునే ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజాప్రతినిధులు,మీడియా మిత్రులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, ఈ కార్యక్రమానికి హాజరై, దేశ ఏక్యతా స్ఫూర్తిని మరింత బలపరచాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు.

## నీట మునిగిన పంటలను,తడిసిన మక్కలు పరిశీలించిన మండల వ్యవసాయ అధికారి.

బయ్యారం,తొవ్వ,అక్టోబర్ 30.



మండల వ్యవసాయ అధికారి కే.రాజు,వ్యవసాయ విస్తరణాధికారులు మండలంలోని బయ్యారం,జగ్గుతండా,నామాలపాడు,కోటగడ్డ, పందిపంపుల గ్రామాలలో ప్రాథమిక పంట నష్టాన్ని అంచనా వేయుటకు గురువారం గ్రామాల్లో పర్యటించారు.పాకాల వాగు,పందిపంపుల వాగు పరిసర ప్రాంతాల్లోని వరి పంటలు నీట మునిగినట్లు తెలిపారు.మొత్తం 2,488 ఎకరాల వరి పంట 1,639 మంది రైతులకు చెందినది, 192 ఎకరాల పత్తి పంట 154 మంది రైతులకు చెందినదిగా గుర్తించినట్లు తెలిపారు.ప్రాథమిక పంట నష్టం గుర్తించి వ్యవసాయ కమిషనరేట్‌కు నివేదించనున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా అధికారులు రైతులను కలసి,తుఫాన్ విపత్కర పరిస్థితి గురించి వివరిస్తూ,రైతులను ఓదార్చి వ్యవసాయ శాఖ సంచాలకుల కార్యాలయం నుండి అనుమతి లభించిన వెంటనే క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా పూర్తి స్థాయి పంట నష్టం లెక్కింపు (ఎన్యుమరేషన్) చేపడతామని,అర్హులైన రైతులకు పంట నష్ట పరిహారం అందచెయ్యడం జరుగుతుందని మండల రైతులకు ఏఓ రాజు హామీ ఇచ్చారు. రహదారులపై మొక్కజొన్న పంటను ఆరబెట్టుకుంటున్న రైతులతో మాట్లాడి,పంటను వర్షం నుండి రక్షించుకునే విధంగా టార్పాలిన్‌లతో కప్పి సురక్షితంగా ఉంచాలని సూచించారు.బయ్యారం పెద్ద చెరువు ను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.ప్రస్తుతం పరిస్థితి సజావుగా ఉందనీ,అలిగేరు పూర్తిగా నియంత్రణలో ఉందనీ తెలిపారు.మండలంలోని రైతులు ప్రస్తుత వర్షాలు,తుఫాన్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటల రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారులు నాగరాజు,తేజస్విని,ఫయాజ్,అఖిల్, రైతులు భాస్కర్ రెడ్డి,వెంకటనారాయణ, పగడాల శ్రీనివాస్,వన్నం రామారావు తదితరులు పాల్గొన్నారు.



# వ్యవసాయ అధికారులు పంట క్షేత్రాలను సందర్శన.

**తొవ్వ,కేసముద్రం,అక్టోబర్30:**



మొంథా తుఫాన్ కారణంగా అధిక వర్షాలతో చెరువు మతళ్ళు పొంగి నేల కొరిగి వరి పంట క్షేత్రాలను కేసముద్రం, ధన్నసరి, ఇతర గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి కేసముద్రం బి, వెంకన్న మరియువ్యవసాయ విస్తరణ అధికారులతో కలిసి పంట క్షేత్రాలను సందర్శించి,రైతులకు పలు మేలైన యాజమాన్య సలహాలు సూచనలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోతకు వచ్చిన వరి పంట ఎక్కడైనా నేలకొరిగిన, నీళ్లలో అడ్డం పడి ఉన్న, రైతులు ఐదు ఆరు వరి దుబ్బులకు కలిపి పైకి లేపి, వరి కోనలకు జుట్లను కట్టినట్లయితే, వరి పంటనుకాపాడుకోవచ్చని , గింజలు మొలక రాకుండా ఉంటుందని,అదేవిధంగా ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పై పాటుగా పిచికారి చేసినట్లయితే కోతకు వచ్చి అడ్డం పడిన వరి పంటలో మొలక రాకుండా, గింజ రంగు మారకుండా ఉంటుందన్నారు.తుఫాను నుంచి వరి, పత్తి మొక్కజొన్న, మిరప పంటలను కాపాడుకునే విషయంలో రైతులకు పలు మేలైన యాజమాన్య సలహాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చిర్ర యాకాంతం గౌడ్ కి చిరు సన్మానం.



**తొవ్వ,కేసముద్రం, అక్టోబర్ 30** :ట్రస్మా జిల్లా అధ్యక్షుడు చిర్ర యాకంతం గౌడ్ కు మహబూబాబాద్ జిల్లా ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ తరుపునసన్మానంమహబూబాబాద్ జిల్లా ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ కేసముద్రంలోని వివేకవర్ధిని విద్యా సంస్థల అధిపతి చిర్ర యాకాంతం గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించింది. ఇటీవల మహబూబాబాద్ జిల్లా ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు ఆయనను గురువారంమహబూబాబాద్ డిస్ట్రిక్ట్ ప్రైవేట్ టీచర్స్ యూనియన్ సత్కరించింది. ఈ మేరకు యూనియన్ అధ్యక్షుడు గండు మురళి మాట్లాడుతూ ఎల్లవేళల మాకు మా యూనియన్ కి మా ఉపాధ్యాయులకు అండగా ఉండాలని వారి సమస్యలను మీ సమస్యలుగా భావించి పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ డిస్ట్రిక్ట్ ప్రైవేట్ టీచర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి చేపూరి రవి, ఉపాధ్యక్షులు సొల్లేటి వెంకన్న మరియు బోధు ప్రవీణ్, కోశాధికారి మాశెట్టి రాంబాబు,ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు వినోద్ మరియు రఘు పాల్గొన్నారు.

# తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి


## సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్



తొవ్వ, గార్ల అక్టోబర్ 30:

గత మూడు రోజులుగా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న అకాల వర్షాల వల్ల గార్ల మండల కేంద్రంలో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని వారిని తక్షణమే ప్రభుత్వం ఆదుకొని వారికి భరోసా కల్పించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సిపిఐ రైతు సంఘం బృందం తో కలిసి బుధవారం నాడు దెబ్బతిన్నటువంటి పంటలను పరిశీలన చేశారు.ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల ఈ సంవత్సరం రైతులు తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నారని మొల్గే నక్క పై తాటి పండు పడ్డట్టు తుఫాను ప్రభావం వల్ల చేతికి రావాల్సినటువంటి వరి, పత్తి, మిర్చి మొదలగు అన్ని రకాల పంటలకు పూర్తిగా నష్టం వాటిల్లిందని అన్నారు. ఈ తుఫాన్ ప్రభావంతో అరకొరగా ఉన్న ప్రతి పంట పూర్తిగా తుడిచిపెట్టకుపోయిందని తడిసిన పత్తిని తక్షణమే ప్రభుత్వం సిసిఐ ద్వారా కొనుగోలు చేయాలని మండలంలో నష్టపోయినటువంటి అన్ని పంటలకు ప్రభుత్వం తక్షణమే అధికార యంత్రాంగాన్ని పంపించి రైతులకు పూర్తిస్థాయిలో పంట నష్టాన్ని కౌలు రైతులకు వ్యవసాయ భూమికి కవులు ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు.అదికారులందరు యుద్ధ ప్రాతిపదికన అందరు అందుబాటులో ఉండాలని కోరారు.దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి పంపాలని అదికారులను కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ గార్ల మండల కార్యదర్శి జంపాల వెంకన్న, రైతు సంఘం మండల అధ్యక్షుడు రాగం రమేష్,పోతుల నరసింహారావు,దూపాటి జనార్ధన్,పొన్నం వెంకన్న,రాగం సత్యం,ఇరుగు వెంకటేష్,మల్లారపు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# మౌలా పార్థివదేహానికి నివాళులు అర్పించిన బిఆర్ఎస్ నాయకులు.



బయ్యారం,తోవ్వ,అక్టోబర్ 30.

బయ్యారం మండల కేంద్రంలోని ముస్తఫానగర్ కాలనీ కి చెందిన ఎస్కే.మౌలా(60)ఉపాధ్యాయుడు గుండెపోటుతో బుధవారం మృతి చెందారు.విషయం తెలుసుకున్న బయ్యారం మండల బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాత గణేష్ మౌలా పార్థివదేహానికి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో గంగుల సత్యనారాయణ,బానోతు మురళీకృష్ణ,బానోత్ లక్ష్మణ్ నాయక్, రేపాకుల వెంకన్న,సింగారం శ్రీను,జార్పుల శ్రీను,జగన్,కీర్తి ఉదయ్,గంట రాము,దాసరి రాము,దేవోజీ,వీరన్న, బైగల్ల వీరబాబు, మహేష్,తొట్టి హరీష్,సునీల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు

# అక్రమ కేసులు ఎత్తివేసే వరకు వామపక్షాల పోరాటం ఆగదు

## - బి. విజయ సారథి, సాదుల శ్రీనివాస్, మండల వెంకన్న, గౌని ఐలయ్య

తొవ్వ, మహబూబాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 30:



అక్రమ కేసులు ఎత్తివేసే వరకు వామపక్షాల పోరాటం ఆగదని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. విజయసాయిరెడ్డి, సీపీఎం వర్గ జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్, సీపీఎం ఎమ్ఎల్ రాష్ట్ర నాయకులు మండల వెంకన్న, గౌని ఐలయ్య హెచ్చరించారు. నాడు నల్ల చట్టాలు రద్దు చేయాలని ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని వామపక్షాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేసిన పోరాటంలో భాగంగా నేడు వామపక్ష పార్టీల నేతలు కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీల నేతలు మాట్లాడుతూ మోడీ, కేసీఆర్ నియంతలుగా వ్యవహరించి వామపక్ష పార్టీలపై నాడు కేసులు పెట్టారన్నారు. ఎన్ని కేసులు పెట్టినా నల్ల చట్టాలు, ఆర్టీసీ పోరాటంలో తమ వామ పక్షాలదే విషయమన్నారు. తాము తలుచుకుంటే ప్రభుత్వాలు కూలిపోతాయని హెచ్చరించారు. నాడు ప్రజలంతా ఏకమై కార్మికులతో కలిసి మొన్న జరిగిన ఎన్నికల్లో కేసీఆర్ కు బుద్ధి చెప్పారన్నారు. దేశ స్థాయిలో మోడీకి రానున్న రోజుల్లో అదే గతి పడుతుందన్నారు. మొన్న జరిగిన ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో అధికారంలోకి వచ్చి విర్రవీగిన రానున్న కాలంలో మోడీ పతనం తప్పదన్నారు. నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవచూపి వామపక్ష పార్టీల నేతల పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. కోర్టుకు హాజరైన వారిలో వామపక్ష పార్టీల నేతలు బి అజయ్ సారధి రెడ్డి, తమ్మెర విశ్వేశ్వరరావు, నల్లు సుధాకర్ రెడ్డి, ఆకుల రాజు, గుణగంటి రాజన్న, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, వరిపల్లి వెంకన్న, మేక వీరన్న, చొప్పరి శేఖర్, కుంట ఉపేందర్, హాలావత్ లింగ్య, జగ్గన్నసమ్మెట, రాజమౌళి, సామ పాపయ్య, తండ మాధవి, కనకం పద్మ, అల్వాల వీరయ్య, ఆలకుంట్ల సాయిలు, సమ్మెట రాజమౌళి, నాగయ్య, మధు, ఉపేందర్ తదితరులు హాజరైనారు.

# లో లెవెల్ వంతెనలను బ్రిడ్జిలుగా నిర్మాణం చేయాలి

## బిజెపి మండల అధ్యక్షులు చందు రాజ్ కుమార్ యాదవ్



తొవ్వ, నెల్లికుదురు, అక్టోబర్ 30:

మండలంలోని రావిరాల, ఆలేరు, వావిలాల గ్రామాల వద్ద ఉన్న లో లెవెల్ వంతెనలను బ్రిడ్జిలుగా నిర్మాణం చేపట్టాలని బిజెపి మండల అధ్యక్షులు చందు రాజ్ కుమార్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మెంతా తుఫాన్ వల్ల లో లెవెల్ వంతెనల్లో ప్రవహిస్తున్న వరద ఉధృతిని, దెబ్బతిన్న పంటల ను మండల ఉపాధ్యక్షులు కుక్కల ఐలయ్య, ప్రధాన కార్యదర్శి రాచ యాకిరెడ్డి తో పాటు స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రావిరాల, రాజుల కొత్తపల్లి చెరువుల పునరుద్ధరణ చేపట్టకపోవడంతో ఆయా గ్రామాల రైతులు వలస వెళ్లి బ్రతకాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అంతేకాకుండా ప్రస్తుతం కురిసిన వర్షాలకు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు పూర్తిగా దెబ్బ తినడంతో రైతాంగం కోట్లాది రూపాయల నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి, వరి, మిరప, మొక్కజొన్న పూర్తిగా దెబ్బతిన్నాయని, తక్షణమే సంబంధిత శాఖ అధికారులతో నష్టపరిహారం అంచనా వేసి నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలన్నారు. లేనట్లయితే రైతులతో కలిసి బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుస్సా యాకన్న, ఎండి ముస్తఫా, శ్రీను నాయక్, స్థానిక నేతలు తదితరులున్నారు.

# తుఫాను కారణంగా ఇల్లు కూలిపోయిన బాధితులకు అండగా ఉంటాం

## ఎమ్మెల్యే మల్ రెడ్డి సహకారంతో వారికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయిస్తాం

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి

## ఆరుట్లలో కూలిపోయిన ఇండ్లను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

తొవ్వ ప్రతినిధి ఇబ్రహీంపట్నం అక్టోబర్ 30



గతకొన్ని రోజులుగా మోంతా తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాల కారణంగా మంచాల మండలంలో ఇండ్లు కూలిపోయిన బాధితులను ఆదుకొని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు గురువారం రోజున తుఫాన్ కారణంగా కూలిపోయిన ఆరుట్ల గ్రామానికి చెందిన గట్ల గణేష్



నూకం రమేష్ చిందం యాదయ్య బొద్రమోని మల్లేష్ నూకం బన్ని తదితరుల ఇండ్లను ఆయన పరిశీలించారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా తుఫాను వల్ల ఇండ్లు కూలిపోగా వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ కంబాలపల్లి బుగ్గరాములు మార లక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మార సురేష్ ఎన్నిదుల సురేష్ మానిపాటి వెంకటేష్ నూకం మల్లేష్ నూకం బాలరాజు భాస్కర్ రైనా ఎండి అశ్రఫ్ ఇంద్రోజు ఆంజనేయులు నూకం సత్యనారాయణ నూకం లక్ష్మయ్య ఆడెపు మధు నూకం భాస్కర్ నూకం శంకర్ నూకం రమేష్ ఆడెపు బాలయ్య ఆవ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు

# మొంథా తుఫాన్ మిగిల్చిన ఇసుక మేటలు

## పెనుగొండలో నీట మునిగిన పంట పొలాలు

## సుమారు 400ఎకరాల మేర నీట మునిగిన వరి

## లబోదిబో మంటున్న రైతన్నలు

## రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకొలు..



తొవ్వ,కేసముద్రం,అక్టోబర్ 30:

మానుకోట జిల్లా కేసముద్రం మండలం పెనుగొండ గ్రామంలో మొంథా తుఫాను ప్రభావానికి వరి పొలాలు పంట చేనులు నీట మునిగాయి.సుమారు 400 ఎకరాల మేర వరి పొలం నీటమునిగింది. దీంతో రైతన్నలు బోరున విలపిస్తున్నారు. పెట్టిన పెట్టుబడి అంతా నీటిపాలైంది.చేసిన కష్టం పెట్టిన పెట్టుబడి అంతా గంగాపాలైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుకోని తుఫానుతో తమ బ్రతుకులుఆగమ్యగోచరంగా మారాయని లబోదిబోమంటున్నారు.



# ఘనంగా రక్తదాన శిభిరం

తొవ్వ, ప్రతినిధి, ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 30



రాచకొండ పోలీస్ కమిషనరేట్ మహేశ్వరం జోన్ ఇబ్రహీంపట్నం డివిజన్ వైష్ణవి గార్డెన్స్ లో జరిగిన మెగా రక్తదాన శిబిరంలో పాల్గొనడం గర్వంగా ఉంది అన్నారు ఇబ్రాహీంపట్నం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెదిరె సికిందర్ రెడ్డి పోలీస్ ఆధ్వర్యంలో జరుగుతున్న అమరవీరుల సంస్మరణ వారాన్ని పురస్కరించుకొని, సేవా కార్యక్రమంలో భాగంగా ఎంతో మంది ప్రాణాలను కాపాడే రక్తదానం చేపట్టిన మీ అందరికీ హృదయపూర్వక అభినందనలు. “మన రక్తదానం %–% ప్రాణదానం” అనే భావనను ముందుకు తీసుకెళ్లుతూ, సమాజానికి కల్పించిన సేవకు వీరు చేసిన ఆధునిక స్ఫూర్తిదాయక భాగస్వామ్యాన్ని అందరూ అభినందించాలి. ఈ రక్తదాన శిబిరంలో ఇబ్రాహీంపట్నం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెదిరె సికిందర్ రెడ్డి రక్తదానం చేశారు %–% ఇది యువత లో సామాజిక బాధ్యతను ప్రతిబింబించే గొప్ప సేవగా నిలుస్తుంది ఈ కార్యక్రమం లో తెలంగాణ రాష్ట్ర నాయకులు కోంగర విశ్ణు వర్ధన్ రెడ్డి , రామకాంత్ రెడ్డి, గుడ్డి మల్లీచందరయ్య , మర సురేష్ , పండాల శ్రీనివాస్ , %వీ==% మండల అధ్యక్షులు మంథని శివ యాదవ్ , ఇబ్రహీంపట్నం యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కుకుడాల నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శీనివాస్ రెడ్డిపై దాడి,హత్యయత్నం చేసిన దొషులను వెంటనే అరెస్ట్ చెయ్యాలి..

## బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు నాయిని శ్రీనివాస్.

బయ్యారం,తోవ్వ,అక్టోబర్ 30.



బయ్యారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డిపై దాడికి నిరసన దీక్ష చేస్తున్న శ్రీనివాస్ రెడ్డికి మద్దతుగా బయ్యారం మండలం భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు నాయిని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్రీనివాస్, వన్నం రామారావు, బొల్లెపెల్లి వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రెటరీ ఊకే రామ్మూర్తి, బీజ్జ కనకయ్య, కురియాల చంద్రయ్య,నిరసన దీక్షలో కూర్చొని మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా మండల నాయకులు నాయిని శ్రీనివాస్, వన్నం రామారావు మాట్లాడుతూ బయ్యారం మండలంలో గత కొంత కాలం నుండి అరాచక శక్తుల అకృత్యాలు ఎక్కువ అయ్యాయని కాంగ్రెస్ పార్టీ కోసం పార్టీ కష్ట కాలంలో పని చేసిన పార్టీ బాద్యుడిపై భౌతిక దాడి చేసి 44 రోజులు అవుతున్న నిందితులని ఎందుకు రిమాండ్ చెయ్యలేదు అని, అధికార బలంతో కేసును పక్క దొవ పట్టించే విషయం తెలిసిదే.రోడ్డుపై నిరసన దీక్ష చేయడం అది అధికార పార్టీ నాయకుడు రోడ్డు ఎక్కడం ఏమిటీ అని ఇదేనా ప్రజా పాలన అంటూ కాంగ్రెస్ పార్టీ నాయకునికే రక్షణ లేదని సామాన్యుల పరిస్థితి ఏమిటి అని అన్నారు.దొషులని శిక్షంచే వరకు ఊరుకునే ప్రసక్తి లేదని తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టు రౌడీ ముదిరి రాజకీయ నాయకులు అవుతున్నారని పోలీస్ వారు శాంతి భద్రతలని కాపాడాలని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని దొషులని వెంటనే రిమాండ్ చేయాలని భారతీయ జనతా పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నాం అన్నారు.

# మొంథా తుఫాన్ కారణంగా నెలకొరిగిన పొలలు..

## నష్టపోయిన రైతులను తక్షణ ప్రభుత్వం ఆదుకోవాలి

**మానుకోట మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ .**



తొవ్వ,కేసముద్రం, అక్టోబర్ 30 :మొంథాతుఫాను ప్రభావంతో చేతికి అందిన పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే అంచనా వేసి పరిహారం చెల్లించి ఆదుకోవాలని మానుకోట మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విత్తనాల దగ్గర నుంచి ఎరువుల వరకు అనేక విధాలుగా రైతులు ఈ ప్రభుత్వంలో కష్టాలు ఎదుర్కొని ఆరుగాలం కష్టపడి పండించిన పంట మరికొద్ది రోజుల్లో కోత దశకు వస్తున్న నేపథ్యంలో తుపాను కారణంగా నియోజకవర్గంలో అనేకచోట్ల వరిచేను నేలమట్టం కావడం రైతులు పార్టీ నాయకుల ద్వారా తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక మండల నాయకులతో కలిసి కేసముద్రం మండలం ధన్నసరి గ్రామంలో నేలమట్టమైన వరి పంటను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే సంబంధిత అధికారులు నష్టపరిహారాన్ని అంచనా వేసి బాధిత రైతులకు చెల్లించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నజీర్ అహ్మద్, పట్టణ అధ్యక్షులు గుగులోత్ వీరు నాయక్, ప్రధాన కార్యదర్శి కమటం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కొంౖడెడ్డి శ్రీవాణి – రవీందర్ రెడ్డి, బానోతు వెంకన్న నాయక్, బిర్రు వెంకన్న, బానోత్ శ్రీను నాయక్, బండారు గోపి, వంగాల అశోక్, భానోత్ భీమా, గణేష్,బాధవత్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# నాయిని శ్రీనివాస్ రెడ్డి దీక్షకు బిఆర్ఎస్ పార్టీ నాయకుల సంఘీభావం.

**బయ్యారం,తోవ్వ,అక్టోబర్ 30.**



బయ్యారం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా గణేష్ ఆధ్వర్యంలో బయ్యారం మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు సెంటర్లో నాయిని శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ బయ్యారం టౌన్ ప్రెసిడెంట్ పై సొంత పార్టీకి చెందిన రౌడీ మూకలు హత్యాయత్నంలో భాగంగా దాడి చేసిన సందర్భంలో ఐదుగురుపై అయినటువంటి హత్యాయత్నం కేసులో కూడా ఈనాటికి పోలీసులు అరెస్టు చేయకపోవడం విడ్డూరంగా ఉంది ఇది ఎవరి మెప్పు కోసం..ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా ప్రజలను కన్నుకు రెప్పలా కాపాడే పోలీస్ యంత్రాంగమే దాడులు నిర్వహిస్తున్న రౌడీ మూకలకు వత్తాసు పలకడం అన్యాయమైన చర్య అని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు..దీనికి ప్రత్యక్ష సాక్షమే అధికార పార్టీ నాయకులపై దాడి, దీక్ష శిబిరాలు.రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ సుమారు రెండు సంవత్సరాలు పూర్తి కాకముందే బయ్యారం మండలంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని రౌడీ మూకలు రాజ్యమేలే ఎటువంటి పరిస్థితి తీసుకోవలసినప్పటికీ బయ్యారంలో సామాన్యులపై జరిగే అత్యాయత్నాలు, దాడులు, ఫ్యాక్షనిజాన్ని ప్రేరేపించే విధంగా బయ్యారం మారుతుందని ఆవేదన చెందుతున్నాము. గతంలో ఎన్ని రకాల పార్టీలు ఉన్నా నక్సలిజం ఉన్న స్వేచ్ఛ వాతావరణంలో ప్రజలు జీవనం కొనసాగించారు..కానీ ఇప్పుడున్నటువంటి పరిస్థితులలో తప్పుచేసి, అక్రమాలు చేసి, అన్యాయాలు చేసి, మోసాలు చేసి మేము చేసిందే రైట్ అనే విధంగా భయభ్రాంతులకు అధికారాన్ని అడ్డుపెట్టుకొని అహంకారపూరితమైన రౌడీయిజాన్ని బయ్యారంలో కొనసాగిస్తుంటే ప్రభుత్వంలో భాగమైనటువంటి పోలీస్ వ్యవస్థ బయ్యారంలో ఉన్నట్ల లేనట్లా...?? అని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ప్రతిపక్ష పార్టీలో ఉన్న వారిని గాని, సామాన్య వ్యక్తులను గాని అతి చిన్న విషయాల పైన స్టేషన్ కు పిలిపించి వారిపై చట్టపరమైన చర్యలకు ఏమాత్రం సమయం కూడా ఇవ్వకుండా చేసేటువంటి పోలీసు వ్యవస్థ వీరిని కాపాడే ప్రయత్నం ఎందుకు చేస్తున్నట్టు..?

**ఎవరి మెప్పు కోసం చేస్తున్నట్టు...?**



ప్రజలకు జరిగే అన్యాయం పైన చర్య తీసుకోవడం ముఖ్యమా.?? ప్రభుత్వంలో పరిపాలనలో ఉన్నటువంటి వారి యొక్క మెప్పు పొందడం ముఖ్యమా..? ఈ సమాజంలో జరిగేటటువంటి అన్యాయం అక్రమాలను దోపిడీలలో రౌడీయిజాన్ని అణిచివేయాలని చెప్పి ప్రభుత్వాలు ఎన్ని చెప్పినప్పటికీ రౌడీలకు సహకరించే పోలీసులుగా మారేటువంటి ప్రయత్నం బయ్యారంలో జరుగుతుందని ప్రజలు ఆ నోట అనుకునే పరిస్థితి ఏర్పడి ఈ మండలంలో భయభ్రాంతులకు ప్రజలు గురవుతున్నారు.దయచేసి మేము కోరుకునే విన్నపం ఈ మండలం ఒకప్పుడు ఏ విధంగా ప్రశాంతంగా అన్ని రాజకీయ పార్టీలు కలిసి ప్రశాంతమైనటువంటి వాతావరణంలో, రాజకీయాలలో ప్రజా శ్రేయస్సును నడిపించారో ఆ పద్ధతిలో ఈ మండలంలో మళ్లీ ఆ పరిపాలనలు రావాలని కోరుతున్నాము.దానికి పూర్తి బాధ్యతగా లా అండ్ ఆర్డర్ ప్రాబ్లం లో లేకుండా సక్రమమైన మార్గంలో ప్రజా శ్రేయస్సు కోరి, ప్రజల బాగోగులు కోరి వారికి జరిగే అన్యాయాలు, అక్రమాల నుంచి బయటికి తీసే అటువంటి ప్రముఖమైనటువంటి పాత్ర పోలీస్ వ్యవస్థది. కాబట్టి మీ యొక్క డ్యూటీలను గాని , చట్టం యొక్క విధానాన్ని గాని అనుసరించి ప్రజలకు న్యాయం జరిగే విధంగా ప్రయత్నం చేయాలని ఈ విధంగా నాయిని శ్రీనివాస్ రెడ్డి మరియు చల్ల గోవర్ధన్ ఇంకా కొంతమంది మిత్రులు వీరందరిపై దాడి చేసినటువంటి రౌడీ మూకల ను తక్షణమే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలందరి తరపున బిఆర్ఎస్ బయ్యారం మండల పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాం.ఈ కార్యక్రమంలో గంగుల సత్యనారాయణ,బానోత్ మురళి కృష్ణ,బానోత్ లక్ష్మణ్ నాయక్,రెపాకుల వెంకన్న,, సింగారం శ్రీను, జర్పుల శ్రీను, జగన్, రాము,కీర్తి ఉదయ్,తదితరులు పాల్గొన్నారు.

# మెంత తుఫాన్ కు పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

**బిఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ యసం రమేష్**



తొవ్వ, నెల్లికుదురు, అక్టోబర్ 30

మెంతా తుఫాన్ తో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని మండల బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యసం రమేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండలంలోని నైనాల గ్రామంలో నష్టపోయిన పంటలను స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు మండలంలో పత్తి, వరి, మొక్కజొన్న, మిరప పంటలు వేసిన రైతులు తీవ్రంగా నష్ట పోయి పెట్టుబడులు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదన్నారు కావున ప్రభుత్వం వెంటనే స్పందించి అధికారులతో క్షేత్ర స్థాయి పరిశీలన జరిపించి జరిగిన నష్టానికి తగిన పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. తక్షణ సహాయక చర్యలు చేపట్టకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులుశివర్ల కొమురయ్య, ఆవుల సాయిమల్లు, భత్తిని నవీన్ రైతులు ఆకుల మల్లేష్, యాసం వెంకన్న,దాసరి కుమార్ తదితరులు పాల్గొన్నారు

# అక్టోబర్ 31న జరిగే AITUC ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి-

**దుబ్బాక సంజీవ**

తొవ్వ,అక్టోబర్ 30,సంస్థాన్ నారాయణపూర్ :



ఈ నెల 31న జరిగే AITUC 106వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని కార్మికులకు దుబ్బాక సంజీవ పిలుపునిచ్చారు. %ూ×ుఖజ% ఆవిర్భావం నుంచి నేటి వరకు,కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు, సమ్మెలు చేసి నిరంతరం రాజీలేని సమరం చేస్తుందాన్నారు. ఈ నేపథ్యంలో రాబోయే కాలంలో రాజిలేని పోరాటాలకి కార్మికులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పోరాడి సాధించుకున్న 29 చట్టాలను 4 కోడ్లగా మార్చి కార్మికులకు హక్కులు లేకుండా చేయాలని చేస్తుందన్నారు.అదే విధంగా రేపు నారాయణపురం మండల కేంద్రంలో నిర్వహించే %ూ×ుఖజ% ఆవిర్భావ దినోత్సవాన్ని కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా %ూ×ుఖజ% మండల ప్రధాన కార్యదర్శి చిలువేరు అంజయ్య,%దీూజ% మండల అధ్యక్షులు జనగాం శంకరయ్య కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# బీసీల 42% రిజర్వేషన్ల సాధనకై పోరాటాలు నిర్వహిస్తాం....

## లాయర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు హైకోర్టు న్యాయవాది నర్రి స్వామి




**తొవ్వ,అక్టోబర్ 30,నాంపల్లి:**

నాంపల్లి కోర్ట్ ఆవరణలో బీసీ లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమ పోస్టర్ కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ లో ముఖ్యఅతిథిగా తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, అఖిల భారతీయ న్యాయవాద సంయుక్త ఆదివక్త మంచ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైకోర్టు ప్రముఖ న్యాయవాది నర్రి స్వామి కురుమ పాల్గొని పోస్టర్ ఆవిష్కరించిమాట్లాడుతూ బీసీల 42% రిజర్వేషన్ కోసం ఉద్యమించే ప్రతి సంఘాలకు కార్యక్రమాలకు మా సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేస్తున్నామన్నారు ప్రస్తుత భారత దేశ జనాభా ప్రకారం మారిన ఆర్థిక స్థితిగతుల ప్రకారం బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించడం అనేది న్యాయవాదమైన డిమాండ్ అని తెలియజేశారు అదేవిధంగా న్యాయవాదులకు రక్షణ చట్టాలు ఆమోదించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు బీసీ లాయర్స్ అసోసియేషన్ నాయకుడు దేవరాజ్ గౌడ్ మాట్లాడుతూ నర్రి స్వామి న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయుచునే అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అదేవిధంగా బీసీ లాయర్స్ అసోసియేషన్ కార్యక్రమాలకు మద్దతు తెలియజేసినందుకు ధన్యవాదాలు ఆ పోరాటం బిసి రిజర్వేషన్లు సాధించే వరకు ఉంటుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు డిజి వెంకటేష్, కరిక మల్లేష్, చంద్రమౌళి,పరశు రాములు, మహేష్ బాబు, శ్రీధర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు

# వరద ప్రభావిత ప్రాంతాల్లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య విస్తృత పర్యటన

## ఎన్డీఆర్ఎఫ్ బోటులో లోతట్టు ప్రాంతాలకు చేరుకుని పాల ప్యాకెట్లు, త్రాగునీరు, ఆహారాన్ని స్వయంగా అందజేసిన ఎంపీ

## వరద ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా ఆహారం, తాగునీరు పంపిణీ విధానాన్ని పరిశీలించిన ఎంపీ



**తొవ్వ ,ప్రతినిధి,అక్టోబర్ 09:**
మొంథా తుఫాను ప్రభావంతో వరద నీటిలో మునిగిపోయిన హనుమకొండ గోపాలపురం, టీఎన్జీవోస్ కాలనీ తదితర లోతట్టు ప్రాంతాలను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య స్వయంగా పర్యటించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వరద ప్రభావిత ప్రాంతాల్లో నిరంతర పర్యటన నిర్వహిస్తూ పరిస్థితిని ప్రత్యక్షంగా ఎంపీ పరిశీలించారు గోపాలపురం ప్రాంతంలో వరద ఉధృతి తీవ్రతను గమనించిన ఎంపీ వెంటనే ఇరిగేషన్ అధికారులతో





మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం టీఎన్జీవోఎస్ కాలనీలో ఎన్డీఆర్ఎఫ్ బృందంతో కలిసి బోటులో ప్రయాణిస్తూ మొత్తం ప్రాంతాన్ని పరిశీలించారు. జల దిబ్బంధంలో ఉన్న ఇళ్ల వద్దకు స్వయంగా చేరుకుని, ప్రజలకు ధైర్యం చెబుతూ పాల ప్యాకెట్లు, త్రాగునీరు, ఆహార ప్యాకెట్లు అందజేశారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విన్న ఎంపీ, తాత్కాలిక ఉపశమనంతో పాటు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

వరంగల్

వరంగల్ బి ఆర్ నగర్ కాలనీ వరద ప్రభావిత ప్రాంతాన్ని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్వయంగా పర్యవేక్షించారు. అక్కడ డ్రోన్ల ద్వారా ఆహారం, తాగునీరు పంపిణీ జరుగుతున్న విధానాన్ని మంత్రి కొండ సురేఖ, కలెక్టర్ డాక్టర్ సత్య శారద గార్లతో కలిసి పరిశీలించిన ఎంపీ డా. కడియం కావ్య ప్రజలకు ధైర్యం చెప్పారు. ప్రతి కుటుంబానికి సహాయం వేగంగా చేరేలా అధికారులకు సూచనలు చేశారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, సహాయక చర్యలు నిరంతరం కొనసాగుతాయని ఎంపీ భరోసా ఇచ్చారు.

# ఏరియా ఆసుపత్రి పై వదంతులు నమ్మొద్దు



**తొవ్వ ,మహబూబాబాద్ ,అక్టోబర్ 30:**
మహబూబాబాద్ జనరల్ హాస్పిటల్‌లో బతికి ఉన్న వ్యక్తిని మార్చురీలో పెట్టారంటూ వస్తున్న వార్తలు అవాస్తవం అని హాస్పిటల్ సూపరింటెండెంట్ తెలిపారు.రోడ్డుపైన, వర్షంలో పడి ఉన్న బెగ్గర్‌ను మానవత్వంతో మార్చురీ సెక్యూరిటీ సిబ్బంది హాస్పిటల్‌లో చేర్పించారు.భారీ వర్షంలో రోడ్డుపైన, నడవలేని స్థితిలో ఉన్న వ్యక్తిని మార్చురీ సిబ్బంది దగ్గర్లో ఉన్న బెంచ్‌పైకి చేర్చి అక్కడి నుంచి వార్డుకు షిఫ్ట్ చేశారు.దాన్ని వక్రీకరించి కొంతమంది ప్రభుత్వ హాస్పిటల్‌పై బురదజల్లే కుట్ర చేస్తున్నారు.రాజకీయ కుట్రల్లో ప్రభుత్వ దవాఖాన్లను బలి చేయొద్దని, పేద ప్రజల దేవాలయాలపై విషం చిమ్మొద్దని హాస్పిటల్ సూపరింటెండెంట్ విజ్ఞప్తి చేశారు.

# అక్రమ వలసదారులకే కాంగ్రెస్ రక్షణ

**– గోరక్షకులపై తప్పుడు కేసులు: కిషన్‌రెడ్డి తీవ్ర విమర్శలు**

**– ప్రభుత్వం చేయాల్సిన పనిని గోరక్షకులు చేస్తుంటే వారినే వేధిస్తోంది**

**– కేంద్ర మంత్రి ఆరోపణ**

హైదరాబాద్, అక్టోబర్ 30 :
భారతదేశంలో ప్రజల భద్రతకు కట్టుబడి ఉండాల్సిన ప్రభుత్వం, దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జీ. కిషన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. అక్రమంగా దేశంలోకి చొరబడిన బంగ్లాదేశీయులు, అక్రమ వలసదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం రక్షణ కవచంలా మారిందని ఆయన ఆరోపించారు. దేశ ప్రజలకంటే అక్రమ వలసదారులకే కాంగ్రెస్ ప్రభుత్వం రక్షణ ఇస్తోంది.




అక్రమంగా గోవులను తరలిస్తూ, చంపి, వాటి మాంసాన్ని మోసపూరితంగా విక్రయిస్తున్న సంఘవిద్రోహ శక్తులను అడ్డుకోవాల్సింది పోయి, వారినే కాపాడుతోంది అని అన్నారు. గోరక్షకులపై తప్పుడు కేసులు నమోదు చేసి, అరెస్టు చేసి, జైలులో వేయడం ద్వారా ప్రభుత్వం తన అసలు స్వరూపాన్ని బయటపెడుతోంది అని ఆయన మండిపడ్డారు. గోరక్షకులు దేశ చట్టాన్ని కాపాడటమే లక్ష్యంగా పనిచేస్తుండగా, వారిపై తప్పుడు ఆరోపణలు మోపడం కాంగ్రెస్ పాలనలో కొత్త పంథాగా మారిందని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి మరోసారి హితవు పలుకుతూ, “ప్రజలపై తుపాకులతో దాడి చేస్తున్నవారిని ప్రభుత్వం మన్నిస్తూ, చట్టానికి కట్టుబడి ఉన్న వారిని శిక్షిస్తోంది. ఇది ప్రజాస్వామ్యానికి మచ్చ” అని అన్నారు. ప్రభుత్వం చేయాల్సిన పనిని గోరక్షకులు చేస్తుంటే, వారినే ఇబ్బంది పెట్టడం ప్రజల్లో ఆగ్రహం రేపుతోందని ఆయన పేర్కొన్నారు. కిషన్‌రెడ్డి వ్యాఖ్యలతో తెలంగాణలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై బీజేపీ తరచూ తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్న నేపథ్యంలో, ఆయన వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుంది

**– ప్రజా హామీలు నెరవేర్చాం**

**– రేషన్ కార్డులు, నాణ్యమైన బియ్యం పంపిణీ**

**– ఉత్తమ్ కుమార్ రెడ్డి**



హైదరాబాద్, అక్టోబర్ 30:
జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించబోతుందని, ప్రజల విశ్వాసం తమ పక్షాన ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. ఆయన సోషల్ మీడియా వేదికగా చేసిన ప్రకటనలో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడిందని తెలిపారు. “జూబ్లీహిల్స్ మాత్రమే కాదు, రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై సంతోషంగా ఉన్నారు” అని ఉత్తమ్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఎలాంటి రాజీ పడలేదని అన్నారు. ప్రజలకు అందజేసిన రేషన్ కార్డులు, పంపిణీ చేసిన నాణ్యమైన బియ్యం కాంగ్రెస్ పాలనలో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చాయని వివరించారు. ఉపఎన్నికలో ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ అభ్యర్థి అత్యధిక మెజార్టీతో గెలుస్తాడని ఆయన ధీమా వ్యక్తం చేశారు. “కాంగ్రెస్ ప్రజలతో ఉన్న పార్టీ, ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న ప్రభుత్వం” అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపుతో కాంగ్రెస్‌కి కనువిప్పు కలగాలి

**– ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**

**– బోరబండలో మాగంటి సునీత గోపీనాథ్‌కు మద్దతుగా ప్రచారం**

హైదరాబాద్, అక్టోబర్ 30 :
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపుతో కాంగ్రెస్ పార్టీకి కనువిప్పు కలగాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆకాంక్షించారు. బోరబండ డివిజన్ ఇంచార్జ్‌గా ఆయన గురువారం బాబా సైలానీ నగర్‌లో మాగంటి సునీత గోపీనాథ్కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సునీత కుమార్తెలు దీక్షిత, అక్షితలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ “మన బతుకులకు భరోసానిచ్చిన పార్టీ బీఆర్ఎస్. కానీ అబద్ధపు హామీలతో ప్రజలను మోసగించిన పార్టీ కాంగ్రెస్. హామీలను నిలబెట్టుకోలేక ప్రజలకు మొండి చెయ్యి చూపింది,” అని విమర్శించారు. నవంబర్ 11న జరగబోయే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పక్షాన నిలబడి, ‘కారు’ గుర్తుకు ఓటు వేసి మాగంటి సునీత గోపీనాథ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

